Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 341 | కరీంనగర్ | శుక్రవారం 1 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## ఏసిబికి చిక్కిన లంచగొండి అధికారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30 : జిల్లాలోని ఓ ఫారెస్టు బీట్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. జిల్లాలోని గుండాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నడిమిగూడెం ఫారెస్టు బీట్ అధికారి బానోత్ నరేష్‌ను గురువారం రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. తన తండ్రికి ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల పోడు భూముల్లో అటవీ అధికారులు జోక్యం చేసుకోవద్దని కోరగా బీట్ అధికారి లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి బీట్ అధికారిని పట్టుకుని వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

## సలహాదారుగా విహెచ్ నియామకం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హను మంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబినెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

## అక్రిడిటేషన్ కార్డులను అందజేసిన
# పొంగులేటి

### - అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 :జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో

11లో

శ్రామిక వర్గానికి

## ఎప్పుడూ అండగా ఉన్నాం

### - కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
### - మేడు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : మే డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ఎలాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు

11లో



## సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో
# జవాబుదారీతనం

### - విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
### - వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
### - ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
### - సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్,

11లో

## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

### - భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
### - అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి
### - కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని

11లో



సీఎం రేవంత్ తీరుతో

## పోలీస్ శాఖకు అప్రతిష్ట

### - బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్30 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని పోలీసులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారని, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పోలీసు డిపార్ట్‌మెంట్ బలి అవుతోందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ నాయకులను ఇరికించే కుట్రలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కేసులో 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదని విమర్శించారు. ఛార్జ్ షీట్‌లో బీఆర్ఎస్ నాయకుల పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు.ఒక సీనియర్ జర్నలిస్టును ఇరికించి, అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేస్తే బీఆర్ఎస్ నాయకుల పేర్లు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారని ఆరోపించారు.

## త్వరలో ట్రైబల్ వర్సిటి క్యాంపస్ నిర్మాణం

### - రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు
### - ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

### - ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యావశ్యకం
### - వీడ్కోలు సన్మానంలో డిజిపి శివధర్ రెడ్డి
### - కొత్త డిజిపి సివి ఆనంద్‌కు అభినందనలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్30 : రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమిలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్డ్ అవుతున్న సందర్భంగా పోలీస్ అధికారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ 32 ఏళ్ల సుదీర్ఘకాలంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు మిగిలాయన్నారు. వృత్తిలో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. పోలీసింగ్ విధానంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, యువ పోలీస్ అధికారులు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసిచారు. తన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని సీవీ ఆనంద్ తెలిపారు. 1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థితులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ నడిపించామని తెలిపారు.

11లో

## ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం

### కేవలం మూడు నెలలకే పరిమితం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని మరియు అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేసే ఉద్దేశంతో, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ఈ రాయితీ పథకం మే 1నుంచి జూలై 31 వరకు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుంది. ఈ గడువు లోపు తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం. రాయితీ ప్రకటించడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్లాట్లను/ లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్‌అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020 కు సవరణలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, మరియు పంచాయతీ రాజ్ కమిషనర్ సహా సంబంధిత అధికారులందరినీ ఆదేశించారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా పరిష్కారం లభిస్తుందని, తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే సువర్ణావకాశం ప్రజలకు దక్కిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

### - ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం
### - టిఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

# 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 30 : రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించి సాగు ఖర్చులు తగ్గిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు తక్కువ యూరియా వినియోగిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకోవాలని, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు మాత్రమే రసాయన ఎరువులు వాడుతూ ప్రకృతిని సంరక్షించాలన్నారు. పంట మార్పిడి పాటించడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయాలని, నీటి వినియోగాన్ని తగ్గించి భవిష్యత్ తరాలకు వనరులను కాపాడాలని రైతులకు సూచించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని చెప్పారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు గ్రామాలకే వెళ్లి రైతులకు ఆధునిక వంగడాలు, యంత్రాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. నంగునూరు సమీపంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించామని, రైతులు పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. శాస్త్రవేత్తలు చెప్పిన సాంకేతిక విషయాలను ఇతర రైతులతో పంచుకోవాలని సూచించారు. వ్యవసాయంలో మార్పులు తీసుకురావాలంటే రైతులు చైతన్యవంతంగా ఉండాలని, ఔత్సాహిక రైతులకు శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఆదర్శ రైతు వ్యవస్థను మరింత బలోపేతం చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అగ్రికల్చరల్ డీన్ ఝాన్సీ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం గత 60 సంవత్సరాలుగా శాస్త్రవేత్తలను తయారు చేయడంతో పాటు కొత్త వంగడాలు, ఆధునిక సాగు పద్ధతులపై పరిశోధనలు కొనసాగిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ ఫిష్ పాండ్‌తో మంచిర్యాలకు కొత్త గుర్తింపు

## - ఆలయాలు, మత్స్య రంగం భారీగా అభివృద్ధి - ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, ఏప్రిల్ 30 : మంచిర్యాల నియోజకవర్గానికి అభివృద్ధి దిశగా కీలక అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలోనే మొట్టమొదటి ఇంటర్నేషనల్ ఫిష్ పాండ్ మన ప్రాంతానికే రావడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. దీని ద్వారా మత్స్య సంపద అభివృద్ధికి విశాల అవకాశాలు కలుగుతాయని, చేపల విత్తన ఉత్పత్తి ఇక్కడే జరుగుతుందని వెల్లడించారు. రాష్ట్రంలోని చెరువులకు అవసరమైన మత్స్య విత్తనాలను ఇక్కడి నుంచే సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆమోదం లభించిందని చెప్పారు. దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంను రూ.70 కోట్లతో అభివృద్ధి చేసి "రెండవ అన్నవరం"గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పుష్కరాల కంటే ముందే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గూడెం పైప్‌లైన్ మరమ్మత్తులు చేపట్టి, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే పుష్కరాల సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయంకు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా అయినా ప్రారంభించామని, రైతులకు సరిపడ విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ఆరోపణలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, రాష్ట్ర మంత్రివర్గానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా మరియు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

## - తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి - తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది. ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# జనగామ మున్సిపల్ కౌన్సిల్‌లో ఉద్రిక్తత

## వైస్‌చైర్మన్‌కు గౌరవం ఇవ్వలేదంటూ బిఆర్ఎస్ ఆందోళన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఏప్రిల్ 30 : జనగామలో శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలుకు వేదికపై కుర్చీ ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమావేశం ప్రారంభమైన వెంటనే వైస్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ప్రకారం స్థానం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది బీఆర్ఎస్ నేతలు స్వయంగా కుర్చీ తీసుకువచ్చి వైస్ చైర్మన్‌ను కూర్చోబెట్టడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. వివాదం మరింత పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు వేదికపై కూర్చున్న వైస్ చైర్మన్‌ను పోలీసులు కిందకు దించారు. ఈ చర్యతో బీఆర్ఎస్ నాయకులు మరింత అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడమంచి బాలమణి ఈ వివాదంపై స్పందించారు.

ఈ వేదికపై కూర్చోవడానికి ప్రత్యేక హక్కు లేదా నిబంధన లేమీ లేవని, కమిషనర్ మార్గదర్శకాల ప్రకారమే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ ఘటనలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఈ వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు వేదిక ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వైస్ చైర్మన్‌కు కనీస గౌరవం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు

## - మంగ్లీ సోదరుడి అకౌంట్‌కు డబ్బులు - నిందితుడు రమావత్ మధు ట్రాన్స్‌ఫర్ - బ్యాంకర్లను వివరాలు కోరిన పోలీసులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్30 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోన్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. సింగర్ మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. అయితే, ఎంత మేర నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యిందో అధికారులు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు రమావత్ మధు అకౌంట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) సీజ్ చేసింది. రమావత్ మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌కు చెందిన అకౌంట్ల పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మరోవైపు నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో తమ పేర్లను అనవసరంగా లాగుతున్నారని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్ ఆరోపిస్తున్నారు. కాగా, నిందితుడు రమావత్ మధు.. అధిక వడ్డీ పేరుతో వేల మంది నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

# సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

## - భార్య అక్రమ సంబంధాలతో తీవ్ర మనోవేదన - తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ టెక్కీ
## - సూసైడ్ నోట్ ఆధారంగా వివరాలు వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం సృష్టించిన టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ బయటకు రావడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలిశాయి. భార్య ఇతరులతో శారీరక సంబంధాలతో విసిగిపోయి సీతారాం ఆత్మహత్య చేసుకున్నట్టు నోట్ ద్వారా వెల్లడించాడు. తను వద్దని చెప్పినా వినలేదని సీతారాం పేర్కొన్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సీతారాం కుటుంబం బాచుపల్లిలో స్థిరపడింది. అయితే రేణుక తన భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని, ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ దారుణాలు చూడలేక భర్త సీతారం హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకున్న రేణుక రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. తన భార్య నిజ స్వరూపం తెలిసిన సీతారాం ఫిబ్రవరి నెలలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ లేఖలో నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో అక్రమంగా శారీరక సంబంధం పెట్టుకుంది. అంతేకాకుండా ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు ఏం కావాలి. ప్రేమనా లేక శృంగారమా..? నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది అంటూ తన ఆవేదన తెలుపుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు జరిపి రేణుకతోపాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. రేణుక నమ్మకద్రోహం వల్ల నెలకు రూ.2 లక్షలు సంపాదించే సీతారాం ప్రాణాలు పోగొట్టుకున్నాడని, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# యాదాద్రిలో నృసింహ జయంతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నృసింహ స్వామి జయంతి ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి అలంకరణ సేవను గురువారం ఉదయం ఊరేగింపు చేపట్టారు. యాగశాలలోని ప్రత్యేక వేదిక పై అధిష్టింప జేశారు. ద్వార తోరణ, మూర్తి కుంభారాధన, చతుఃస్థానార్చన లక్ష్మీనృసింహ, సుదర్శన, గరుడ మూలమంత్ర హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ద్వారకోరణ మాషబలి మహా పూర్ణాహుని చేపట్టి ఏకోత్తర సహస్ర కలశావిషేకము సహస్ర ఘటాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చన, తదుపరి వేదస్వస్తి, నృసింహ అవిర్భావము. ఋత్విక్ సన్మానము మహానివేధన, తీర్థ ప్రసాద గోష్ఠి ఉత్సవ పరిసమాప్తి చేపట్టనున్నారు. అనుబంధ పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం, దబగుంటుపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి ఉత్సవాల సందర్భంగా ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల కోసం ఆందోళన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 : ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. తుర్కపల్లి మండలంలోని ముల్కలపల్లి గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తుర్కపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. చాటలతో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ధర్నాతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఆస్తిపన్ను తగ్గించేందుకు లంచం

## ఎసిబికి పట్టుబడ్డ కాంట్రాక్ట్ ఉద్యోగి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 30 : జిల్లాలోని సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. ఆస్తి పన్ను తగ్గించడానికి బిల్లు కలెక్టర్ ఒక వ్యక్తి నుంచి రూ.35 వేలు లంచం డిమాండ్ చేశాడు. అప్పటికే బాధితుడి నుంచి రూ. 20 వేలు తీసుకున్నాడు. మిగిలిన నగదు కూడా ఇవ్వాలంటూ బాధితుడిపై నిఖిల్ రెడ్డి ఒత్తిడి పెంచాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయించాడు. గురువారం రూ.15 వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు నిఖిల్ రెడ్డి చిక్కాడు. అనంతరం సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ నేతృత్వంలో గురువారం సోదాలు చేపట్టారు. దాదాపు 4 గంటల పాటు ఈ సోదాలు కొనసాగాయి. నిఖిల్ రెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో నిఖిల్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యో గిగా విధులు నిర్వహిస్తున్నాడని డీఎస్పీ తెలిపారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

## - ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధపడుతున్న 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదని డాక్టర్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.



# పది ఫలితాల్లో సరస్వతి కాన్వెంట్ విద్యార్థుల ప్రతిభ

## - ప్రిన్సిపాల్ సుమిత్రా ప్రభాకర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 30 : పదో తరగతి 2026 ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని సరస్వతి కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమిత్ర ప్రభాకర్ కొనియాడారు. బుధవారం విడుదలైన ఈఫలితాల్లో స్కూల్ విద్యార్థిని ఎం.సోనా 575 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, కె.రితికా 571 మార్కులతో ద్వితీయ స్థానం, బి.శివాత్మిక 569 మార్కులతో తృతీయ స్థానం పొందారు. హుదా తబస్సుం 562 మార్కులతో మంచి ఫలితాన్ని నమోదు చేసింది. విద్యార్థుల ఈ విజయంపై ప్రిన్సిపాల్ సుమిత్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు పద్మలత, జమీల్, పోచయ్య, విజయిత, చాందిని, సృజన మరియు దత్త కుమార్ విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ కె.ప్రభాకర్, ప్రిన్సిపాల్ కె.సుమిత్ర విద్యార్థులు వారి తల్లిదండ్రులను సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాలలో ఈ విజయోత్సవం సందర్భంగా ఆనంద వాతావరణం నెలకొంది.

# మే2న నీటి సరఫరాలో అంతరాయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : నగరంలోని పలు ప్రాంతాలకు మే 2వ తేదీన 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తుతుందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌లో ఉన్న 1.36ఎంఎల్ సామర్థ్యం గల పాత బ్యాలెన్సింగ్ ట్యాంక్ శుభ్రపరిచే పనులను మే 2న ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు చేపట్టనున్నారు. ఈ పనుల నేపథ్యంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో లోప్రెజర్‌తో నీటిసరఫరా, గోషామహల్, కార్వాన్, గోల్కొండ, కవాడిగూడ, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధుల్లో సరఫరాలో అంతరాయాలు తలెత్తనున్నాయని తెలిపారు. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# 'తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తీర్చిదిద్దుతాం'

**- ఈ టూ ఈ వేదికతో అంతర్జాతీయ స్థాయికి 1,000 వ్యాపారాలు.**

**- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఈటూఈ)' వేదికను ప్రారంభించామని, ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని వ్యాపారులు, ఎగుమతిదారులు, యువతకు అంతర్జాతీయ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఈటూఈ లోగోను ఆవిష్కరించిన మంత్రి మాట్లాడుతూ, 2027 మార్చి 31 నాటికి తెలంగాణ నుంచి 1,000 వ్యాపారాలు, స్టార్టప్‌లు, విద్యార్థులను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడం లక్ష్యంగా నిర్ణయించామని వెల్లడించారు. ఈ వేదిక ద్వారా బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ సుమారు 19 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతులు సాధిస్తూ దేశంలో కీలక స్థానాన్ని సంపాదించిందని, ఈ కార్యక్రమం ద్వారా ఎగుమతుల వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరింత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన సందీప్ కుమార్ మక్తాలను అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చేర్చే దిశగా ఇది మంచి ముందడుగని కొనియాడారు. ఈ సిరీస్‌లో భాగంగా తొలి అంతర్జాతీయ మిషన్ మే 21 నుంచి 24 వరకు సింగపూర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో వ్యాపార భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, టీ కన్సల్ట్ డైరెక్టర్ భాగ్య లక్ష్మి వాకిటి, సెక్రటరీ యామిని మద్దుకూరి, కేశవ్ సోని తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల ఆధిపత్య ధోరణితో హక్కులు హరించబడుతున్నాయి

**టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 30 : కార్మిక సంఘాల ఆధిపత్య ధోరణి కారణంగా కార్మిక హక్కులు హరించబడుతున్నాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (టీఎస్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి పట్టణంలోని టీఎస్‌యూఎస్ కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కామెర గట్టయ్య మాట్లాడుతూ, గతంలో సింగరేణిలో ఐక్య పోరాటాల ద్వారా అనేక హక్కులు సాధించుకున్న ఘనచరిత్ర కార్మిక వర్గానికి ఉందని ఆయన గుర్తుచేశారు. సింగరేణి కార్మికుల పోరాటాల ప్రభావంతో కోల్ ఇండియా కార్మికులకు కూడా అనేక హక్కులు లభించాయని తెలిపారు. అయితే, సింగరేణిలో ఎన్నికల విధానం ప్రవేశపెట్టడంతో కార్మిక సంఘాలు విభజనకు గురై, గెలిచిన సంఘాలు యాజమాన్యం, ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితి కొనసాగితే సింగరేణి సంస్థ ఉంవశ్రీట ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా బొగ్గు గనులలో భారీ సమ్మె జరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. రైతులు ఢిల్లీలో 700 రోజుల పాటు పోరాడి నల్ల చట్టాలను రద్దు చేయించినట్లే, కార్మికులు కూడా దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 40 కోట్ల కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితేనే కార్మిక హక్కులు పరిరక్షించబడతాయని పేర్కొన్నారు. కొన్ని కార్మిక సంఘాలు ఎన్నికల అనంతరం కృత్రిమ ఉద్యమాలు చేపడుతున్నాయని విమర్శిస్తూ, నిజమైన చిత్తశుద్ధి ఉంటే అన్ని సంఘాలను ఏకం చేసి దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ల అమలు దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో, బొగ్గు, ఆయిల్, విద్యుత్ వంటి ఎనర్జీ రంగాల కార్మికులందరినీ ఏకం చేసి జాతీయ స్థాయిలో నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని గట్టయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జీ.రాములు, పోషమల్లు, ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్, టీఎస్‌యూఎస్ నాయకులు నీరేటి రాజన్న, జైపాల్ సింగ్, చారువాక దాసరి, జనార్ధన్, మసాలా ప్రసాద్ రెడ్డి, నామన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ-అన్నారం ప్రాజెక్టుల్లో పనుల వేగం పెంచాలి

**జయశంకర్-భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 30 : కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద పనులు వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బందిని తక్షణమే నియమించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరీక్షలు దశల వారీగా చేపట్టి పనుల నాణ్యతను నిర్ధారించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ, అన్నారం సరస్వతి బ్యారేజీల పనుల పురోగతిని గురువారం ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా మేడిగడ్డలో కొనసాగుతున్న బోర్‌హోల్స్ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, పనులను వేగవంతం చేయడానికి అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్పష్టంగా సూచించారు. సిబ్బంది వసతి కోసం గతంలో సీఆర్పీఎఫ్ ఉపయోగించిన షెడ్లను పరిశీలించి, అక్కడ విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం అన్నారం ప్రాజెక్ట్ పరిధిలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బందికి వసతి ఏర్పాట్ల కోసం గదులను పరిశీలించారు. అన్నారం అప్‌స్ట్రీమ్ ప్రాంతాన్ని సందర్శించి బోర్‌హోల్స్ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక పరీక్షలను శుక్రవారం నుంచి ప్రారంభించాలని, వాటిని దశల వారీగా నిర్వహిస్తూ పనుల నాణ్యతను కచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన అన్ని వసతి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. డ్రిల్లింగ్ పనులు చేపట్టేటప్పుడు గట్టి శిలా పొర వచ్చేంత వరకు కొనసాగించాలని, ప్రతి దశలో సాంకేతిక పరీక్షలు నిర్వహించడం ద్వారా పనుల ప్రమాణాలు నిలబెట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజూ ఇరిగేషన్ అధికారులు పనులను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేసిన కలెక్టర్, ప్రాజెక్ట్ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ రమేష్ కుమార్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈలు తిరుపతిరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ బలోపేతానికి ప్రత్యేక సభ్యత్వ నమోదు డ్రైవ్

**- మే 1 నుంచి మే 31, 2026 వరకు సభ్యత్వ నమోదు ప్రక్రియ**

**- వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా మెజిస్ట్రేట్ అంకిత్, ఐఏఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాఖ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మే 1 నుంచి మే 31, 2026 వరకు ఈ ప్రత్యేక సభ్యత్వ నమోదు డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో చేపట్టనున్నట్లు తెలిపారు. పాల్వంచలోని ఐడిఓసీ (ఐడీఓసీ) కేంద్రంలో ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్‌ను జిల్లా రెడ్ క్రాస్ శాఖ ఉపాధ్యక్షుడిగా మరియు ప్రత్యేక అధికారిగా నియమించగా, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి, జిల్లా కార్మిక అధికారి, జీఎం ఇండస్ట్రీస్‌లను సభ్యత్వ నమోదు డ్రైవ్‌కు నోడల్ అధికారులుగా నియమించారు. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించి విజయవంతం చేయడానికి కమిటీ అవసరమైన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.

ప్రజలు, యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు లేదా ఇతర వివరాల కోసం పాల్వంచ కలెక్టర్ కార్యాలయంలోని ఓఎస్‌డీ సూపరింటెండెంట్‌ను 9392919706 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

# విద్యాధికారి సేవలు అభినందనీయం

**టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 30 : జిల్లావిద్యాధికారి ఆర్ల విజయ విధి నిర్వహణలో చేసిన సేవలు అభినందనీయమని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఉద్ఘటించారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యాశాఖ సిబ్బంది ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన పదవి విరమణ అభినందన సభలో వారు మాట్లాడారు. 2023లో ఏడిగా జిల్లాలో బాధ్యతలు స్వీకరించి విద్యాశాఖలో క్రియాశీల అధికారిగా తన పాత్రను పోషిస్తూ విధి నిర్వహణలో సంపూర్ణ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఉత్తమ అధికారిగా ప్రశంసలు పొందిన సందర్భాన్ని గుర్తు చేశారు. గత ఆరు నెలలుగా జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి అధికారులతో కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమన్వయం చేసుకుంటూ ఈ ఏటా స్థానిక వెస్లీ కళాశాలలో తన ఆధ్వర్యంలో జరిగిన విజ్ఞాన సదస్సు బ్రహ్మాండంగా నిర్వహించిన డీఈవో సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పదవ తరగతి పరీక్షలలో జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తాను విశేష కృషి చేశారని అన్నారు. అనంతరం టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు సతీష్ రావు, సత్యనారాయణ రెడ్డిలతో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈఅభినందన సభలో అధికారులు సుదర్శన మూర్తి, రాజిరెడ్డి, లక్ష్మీకాంత్ రాజ్, నవీన్, జ్యోతి, జగదీశ్వరి, శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పద్మారావు, రాజగోపాల్ గౌడ్, శివయ్య, సంతోష్, సామ్య నాయక్, శ్రీనివాస్, రాజు, అశోక్, తెరసం అధ్యక్షురాలు కవిత, కేజీబీవీ ప్రిన్సిపల్ కవిత, తదితర ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో ఏప్రిల్‌లో 103% బొగ్గు ఉత్పత్తి

**- 90 శాతం ఓబి తొలగింపు-10,01,051 టన్నుల బొగ్గును రవాణా**

**- సింగరేణి మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, ఏప్రిల్ 30 : సింగరేణి మణుగూరు ఏరియా ఏప్రిల్ 2026 నెలలో బొగ్గు ఉత్పత్తిలో 103 శాతం సాధించి గణనీయ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఈ వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నెలకు నిర్ణయించిన 9,58,500 టన్నుల లక్ష్యానికి గాను 9,85,534 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా, ఈ నెలలో మొత్తం 10,01,051 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఓవర్ బర్డెన్ తొలగింపులో 12 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 10.83 లక్షల క్యూబిక్ మీటర్లను తీయడం ద్వారా 90 శాతం పనితీరు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే, పదవీ విరమణ, వైద్య కారణాలు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సంబంధించిన పలు చెల్లింపులు ఏప్రిల్ నెలలో పూర్తి చేసినట్లు తెలిపారు. సీఎంపీఎఫ్-పెన్షన్ 10 కేసులు, గ్రాట్యుటీకి 12, జిఐఎస్ 2, ఎఫ్‌బిఐఎస్ (డెత్) 8 కేసులు పరిష్కరించగా, 41 మందికి కొత్త సిపిఆర్ఎంఎస్ సభ్యత్వ కార్డులు జారీ చేసినట్లు వివరించారు.

కారుణ్య నియామకాల కింద 7 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేయగా, 31 మంది ఆధారితులకు సహాయం అందించినట్లు తెలిపారు. అలాగే, కేడర్ ప్రమోషన్లు 10, టైమ్ రేటెడ్ ప్రమోషన్లు 4, ఎస్ఎల్పీ ప్రమోషన్లు 2, కన్ఫర్మేషన్లు 9 పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి.శ్రీనివాస చారి, ఏరియా ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, రక్షణ అధికారి డి.వెంకట రామారావు, ఏజిఎం (ఐఈడి) సిహెచ్.రాంబాబు, ప్రాజెక్ట్ అధికారి ఈసం శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం (సివిల్) జి.శివప్రసాద్, డివైసీఎంఓ డా.జ్యోతిర్మయి, సెక్యూరిటీ అధికారి కె.శ్రీనివాస్, పర్యావరణ అధికారి జె.శ్రీనివాస్ రావు, ఫైనాన్స్ మేనేజర్ పి.రమేశ్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ జనగణనకు ములుగు జిల్లా సిద్ధం

**- జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగుఏప్రిల్ 30 : జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరెట్ లో జనగణన పై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు. జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 807 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు ,800 జనాభా ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియ కోసం 545 మంది ఎన్యుమరేటర్లు, 97 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని తెలిపారు. స్వీయ నమోదు కోసం se.census.gov.in పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు. ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్ జి,డి పి ఆర్ ఓ రఫిక్, కలెక్టరేట్ జనగణన పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను కలిసిన పాపన్నపేట మండల బిజెపి నాయకులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 30 : పాపన్నపేట మండల పరిధిలోని కొడపాక గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం, డీసీఎంఎస్ నూతన సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రోజు పాపన్నపేట మండల బీజేపీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మెదక్ పార్లమెంట్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును హైద్రాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సర్పించారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ పంటలు ఎక్కువగా ఉన్నందున రైతుల ఇబ్బందుని దృష్టిలో పెట్టుకొని రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా కలెక్టర్ తో మాట్లాడి నూతనంగా డీసీఎంఎస్ సెంటర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గొల్ల నాగభూషణం, మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్ పాషా, ఉపాధ్యక్షులు బొక్కల భాగేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు జగదీష్ పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ కు వీడ్కోలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 30 : ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ బి.రాజయ్యను గురువారం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ తన కార్యాలయంలో పూలమాలతో సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసు శాఖేనని, అలాంటి వారు ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శేఖర్, రమేష్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం, సభ్యుడు నసీర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లలో చురుకుగా కొనసాగుతున్న స్వీయ జనగణన

**- అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్**

**- పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో జనగణన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 30 : స్వీయ జనగణన ఇండ్ల వివరాల ప్రాథమిక సమాచారం నమోదు జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక బృందాలు, అన్ని వర్గాల వారు, జిల్లా అధికారులు, సిబ్బంది, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, కలెక్టరేట్లోని అన్ని విభాగాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వివరాలను నమోదు చేసుకొని ఐడి పొందుతున్నారని అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ అన్నారు .మే 11 నుండి ప్రారంభమయ్యే సర్వేలో సులభతరంగా తమ వివరాలను నమోదు చేయడం కోసం అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, వైద్య ఆరోగ్యశాఖ, మెడికల్ కాలేజ్ ప్రధాన విద్యాసంస్థలలో ఈ కార్యక్రమం విజయవంతం చేయడం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో గురువారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల స్వీయ జనగణన కార్యక్రమన్ని నిర్వహించారు .ప్రతి ఒక్కరూ తమ వివరాలను బాధ్యతాయుతంగా సమర్పించాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్ని విభాగాల ప్రజలను అధికారులకు సూచించారు. ఈ నమోదు కార్యక్రమంలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు, మట్టారి నాగేశ్వరరావు, డివై గిరి, అయోధ్య రామయ్య, ఆకుల రమేష్, సత్యనారాయణ, శ్రీనివాసచారి, తదితరులు తమ వివరాలను నమోదు చేసుకొని ఐడి పొందారు.

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**స్థానిక ఎస్సై బి.చంద్రశేఖర్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (మల్లంపల్లి), ఏప్రిల్ 30 సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, డ్రగ్స్, నేరాలను నియంత్రణకు చట్టాల కంటే ముందు ప్రజల్లో అవగాహన పెరగవలసిన అవసరం ఉందని ఎస్సై బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గురువారం మల్లంపల్లి మండలం కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ శాఖ మరియు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా జిల్లా సిడిపిఓ, ఎస్సై బి.చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తుందని సాంకేతికత కొత్త పంథులు తొక్కుతున్న తరుణంలో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని, ఓటిపి మోసాలు డిజిటల్ అరెస్టులు ట్రెండింగ్ ఇలా అన్ని మార్గాలలో ప్రజల సొమ్మును కాజేస్తున్నారని చాలామంది వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోతున్నారని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసు కున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపు కున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనం తరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మిక వర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలు కు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వద్దాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతో మంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయిం చుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# శ్రామిక విజయానికి చిహ్నం... మే దినోత్సవం

## మే 1... ప్రపంచ కార్మిక దినోత్సవం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

మే దినోత్సవం కార్మిక ఐక్యతకు సంకేతం. చైతన్యానికి ప్రతిరూపం. చాకిరీకి వ్యతిరేకంగా నినదించిన నేపథ్యం. వేలాది గొంతుకలు ఒక్కటైన సమయం. కార్మిక వర్గ పోరాట పటిమకు నిలువెత్తు నిదర్శనం. ఎనిమిది పని గంటల దినం కోసం పోరాట సందర్భం. ప్రాణ త్యాగాలకు వెరవని వైనం. యాజమాన్యం దిగి వచ్చిన క్రమం. నెరవేరిన కార్మిక లక్ష్యం. కార్మికులు సాధించిన విజయా నికి నిలువెత్తు సాక్ష్యం. కొందరు కార్మికుల రక్త తర్పణం తో కార్మిక ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చిన నేపథ్యం.

1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో పరిమిత పని దినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు సమ్మె చేశారు. ప్రదర్శనను చెదర గొట్టేందుకు పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మార్కెట్ ప్రాంతమంతా రక్తసిక్తమై కార్మికుల హాహాకారాలతో దద్దరిల్లింది. ఒక పోలీసు సార్జెంట్‌ను హత్య చేశారనే నిరాధార అభియోగంతో కార్మిక నాయకులైన పార్సన్, స్పైన్, ఏంగెల్,ఫిషెలను దారుణంగా ఉరి తీశారు.

ఉరికంబ మెక్కిన "స్పైన్" నేను ఉరి తీయబడినంత మాత్రాన ఈ అగ్ని జ్వాల అంతరించదు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అని ప్రభోదించాడు. స్పైన్ మరణ నినాదం శ్రామిక జన శంఖారావమై విశ్వవ్యాప్తంగా మార్మోగి శ్రామిక చైతన్యాన్ని రగుల్కొలిపింది.

చికాగో అమరవీరుల సంస్మరణ దినంగా చరిత్రకెక్కిన మే 1 మేడేగా నిలిచి పోయింది. ఈ ఉద్యమం ప్రాదేశిక సరిహద్దులు దాటి ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించి చివరకు శ్రామిక విజయానికి చిహ్నంగా రోజుకు 8 గంటల పని చట్టబద్దం చేయబడింది. అదే మేడేకు అంకురార్పణ.

1890 మే 1వ తేదీన అమెరికా కార్మిక సంస్థ (ఎ.ఫ్.ఎల్) ఏటా మే 1 అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవంగా జరపాలని సూచించింది. నాటి నుండి నేటి వరకు ఈ మేడే విశ్వవ్యాప్తంగా ఆచరణీయమైంది. ట్రేడ్ యూనియన్లు గాని, పార్లమెంటు గానీ లేని రష్యాలో 1891 మే 1న మార్క్సిస్టులు రహస్యంగా తొలిసారిగా అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవం జరిపారు. ఆనాటి నుండి మే దినోత్సవ సంబరం రష్యా కార్మిక వర్గ విప్లవాత్మక సంప్రదాయంగా పరిణమించింది.

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మే డే నాడు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు. తరవాతి దశకంలో మే 1ని నాజీల వ్యతిరేక దినోత్సవంగా జరిపేవారు. హిట్లర్ పాలనలో ఆ రోజుని జాతీయ కార్మికుల దినోత్సవంగా జరుపుకునే వారు. ఇటలీలో ముసోల్నీ, స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకోలు మే డే పైన అనేక ఆంక్షలను విధించారు.

భారత దేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్లో 1862లో సమ్మెచేశారు. అప్పటి వరకు ఆ రైల్వే కార్మికులు గంటలు పనిచేసే వారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలక వర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పని చేస్తారో మేము కూడా అన్ని గంటలే పని చేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు.

తొలిసారిగా భారత్‌లో 1923 సంవత్సరంలో మే 1వ తేదీ మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను జరుపుకున్నారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచే కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. ఈ చైతన్యంతో 'మే డే'ను పాటిస్తున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమదోపిడీ, అధికంగా పనిచేయించు కోవడం కద్దు. నానాటికీ నిరుద్యోగ రక్కసి విజృంభిస్తున్న నేపథ్యంలో, ఎలాగైనా ఉద్యోగం పొందాలనే తపన, బలహీనత క్రమంలో, ప్రపంచ బ్యాంకు, బహుళజాతి కంపెనీల ఒత్తిళ్ళ ఫలితంగా... కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు హామీలిస్తున్నాయి. ఐ.టి.రంగంలో మార్కెట్ శక్తుల ద్వారా శ్రమ దోపిడీ నానాటికీ పెట్రేగి పోతున్నది.

అమెరికా కేంద్రంగా వున్న కంపెనీలు... కార్మిక చట్టాలు అమలుకు నిచుకొని మన దేశంలో కంపెనీలు పెడుతూ, పని వేళలకు




మించి రాచి రంపాన పెడుతున్నారు. అలా విద్యావంతులైన యువత అధిక జీతాలకు ఆశపడి, కంపెనీల నియంతృత్వ పోకడలకు తలొగ్గి, ఆరోగ్యాలను ఫణంగా పెట్టి, జీవితాలను కొవ్వొత్తుల్లా కరిగించుకుంటున్నారు.

కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో అమలుకై పోరాటం అత్యంత అవసరం, అనివార్యం. ఇక అసంఘటితరంగం. గురించి చెప్పాల్సిన అవసరం లేదు. కాంట్రాక్టు, పార్ట్‌టైం, ఔట్-సోర్సింగ్ లోను ఉద్యోగులకు ఏ కార్మిక చట్టాల నియమాలు వర్తిం చవు. శతాబ్ద కాలం నాటి పరిస్థితులే పునరావృతం అవుతున్న వేళ... ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా... అలనాటి కార్మికవర్గ చైతన్యం మళ్లీ రావాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# అస్తిత్వ పోరాటం నుంచి ఆత్మరక్షణ వరకు

# కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ ప్రయాణం

## తెలంగాణ రక్షణ సేన: ఆశయమా? అస్తిత్వ పోరాటమా ? తెలంగాణ రాజకీయ యవనికపై 'టీఆర్ఎస్' పునరాగమనం




## పేరు పాతదే.. గమ్యం కొత్తది: కవిత సారధ్యంలో 'తెలంగాణ రక్షణ సేన'

తెలంగాణ రాజకీయ యవనికపై ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. రెండు దశాబ్దాల పాటు తెలంగాణ అస్తిత్వానికి, ఉద్యమ స్ఫూర్తికి నిలువుటద్దంగా నిలిచిన 'టీఆర్ఎస్' అనే మూడు అక్షరాలు మళ్లీ సరికొత్త రూపంలో ప్రజల ముందుకు రాబోతున్నాయి. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ప్రతిపాదించిన రాజకీయ వేదికకు "తెలంగాణ రక్షణ సేన" (టిఆర్ఎస్) అనే పేరును భారత ఎన్నికల సంఘం ఆమోదించడం కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు; ఇది తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త వ్యూహాత్మక అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం వెనుక ఉన్న చారిత్రక నేపథ్యం, రాజకీయ అవసరాలు మరియు భవి ష్యత్తు పరిణామాలను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రాజకీయ చరిత్రలో 2001 ఏప్రిల్ 27 ఒక మైలు రాయి. కల్వకుంట్ల చంద్రశేఖర రావు 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని స్థాపించి, నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆనాడు టి.ఆర్.ఎస్ అంటే కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, అదొక భావోద్వేగం. 2014లో స్వరాష్ట్ర కల సాకారమైన తర్వాత, ఆ పార్టీ దశాబ్ద కాలం పాటు తిరుగులేని అధికారంతో రాష్ట్రాన్ని పాలించింది. అయితే, 2022 అక్టోబర్‌లో జాతీయ రాజకీయ కాంక్షతో ఆ పార్టీ తన పేరును 'భారత్ రాష్ట్ర సమితి' (బిఆర్ఎస్)గా మార్చుకుంది. ఆ సమయంలోనే అనేకమంది విశ్లేషకులు ఒక హెచ్చరిక చేశారు: 'తెలంగాణ' అనే పదాన్ని పేరు నుండి తొలగించడం ద్వారా పార్టీ తన ప్రాంతీయ అస్మితను కోల్పోయే ప్రమాదం ఉందని. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ ఆందోళనలను నిజం చేస్తూ, బిఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడానికి ఈ 'గుర్తింపు సంక్షోభం' కూడా ఒక కారణమని తేలింది. ప్రస్తుత తరుణంలో 'తెలంగాణ రక్షణ సేన' ఆవిర్భావం ఈ శూన్యాన్ని పూరించే ప్రయత్నంగా కనిపిస్తోంది. టి.ఆర్.ఎస్ అనే సంక్షిప్త నామం ప్రజల మదిలో ఇంకా సజీవంగా ఉంది. ముఖ్యంగా గ్రామీణ ఓటర్లు, ఉద్యమకారులు ఇప్పటికీ బి.ఆర్.ఎస్ కన్నా టి.ఆర్.ఎస్ అనే పేరుతోనే ఎక్కువ మమేకమవుతుంటారు. ఈ నేపథ్యంలో, కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఈ కొత్త సంస్థ రావడం వెనుక బహుముఖ వ్యూహం ఉంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ వంటి వివాదాలు, రాజకీయ వేధింపులు ఎదుర్కొన్న తరుణంలో, ఆమె తన రాజకీయ అస్తిత్వాన్ని పునరుద్ధరిం చుకోవడానికి 'తెలంగాణ రక్షణ' అనే నినాదాన్ని ఎంచుకోవడం గమ నార్హం. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక ఉద్యమాన్ని నడిపిన అనుభవం ఆమెకు ఉంది. బతుకమ్మను విశ్వవ్యాప్తం చేయడంలో ఆమె చేసిన కృషి గ్రామీణ మహిళల్లో ఆమెకు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. ఇప్పుడు అదే సాంస్కృతిక బలానికి రాజకీయ 'రక్షణ' కవచాన్ని జోడించడం ద్వారా, కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందాలని ఆమె ఆశిస్తున్నారు.

రాజకీయ గణాంకాలను పరిశీలిస్తే, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 39.40 శాతం ఓట్లతో 64 స్థానాలు సాధించగా, బిఆర్ఎస్ 37.35 శాతం ఓట్లతో 39 స్థానాలకు పరిమితమైంది. కేవలం రెండు శాతం ఓట్ల వ్యత్యాసం అధికారాన్ని తారుమారు చేసింది. బి.ఆర్.ఎస్ కోల్పోయిన ఆ స్వల్ప ఓటు బ్యాంకు ప్రధానంగా తెలంగాణ సెంటిమెంటును బలంగా నమ్మే వర్గాలదే. ఇప్పుడు తెలంగాణ రక్షణ సేన ఆ ఓట్లను తిరిగి ఆకర్షించగలిగితే, అది రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేస్తుంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఒక పార్టీ పేరు మారిన తర్వాత పాత పేరు లేదా సంక్షిప్త నామం ఖాళీగా ఉంటే, దానిని ఇతరులు కోరే అవకాశం ఉంటుంది. ఈ చట్టపరమైన వెసులుబాటును కవిత వర్గం చాకచక్యంగా వాడుకుంది. భారత ఎన్నికల సంఘం ఆర్టికల్ 324 ప్రకారం రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. "తెలంగాణ రాష్ట్ర సమితి" అనే పేరు రికార్డుల్లో లేకపోవడంతో, "తెలంగాణ రక్షణ సేన"కు అదే సంక్షిప్త నామం రావడం సాంకేతికంగా సాధ్యమైంది. అయితే, ఈ మార్పు బి.ఆర్.ఎస్ పార్టీకి ఒక సవాలుగా పరిణమించే అవకాశం ఉంది. ఒకే కుటుంబానికి చెందిన నాయ కులు రెండు వేర్వేరు పార్టీలను (ఒకటి బిఆర్ఎస్, మరొకటి ప్రతిపాదిత టిఆర్ఎస్) నడిపితే, అది ఓటర్లలో గందరగోళానికి దారితీస్తుందా లేక రెండు శక్తులుగా విడిపోయి ప్రత్యర్థులను దెబ్బ తీస్తాయా అన్నది చర్చనీయాంశం. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలులో తలమున కలై ఉండగా, బిఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడు తోంది. మరోవైపు బిజెపి హిందుత్వ మరియు జాతీయవాదంతో తన బలాన్ని పెంచుకుంటోంది. ఈ త్రిముఖ పోటీలో 'తెలంగాణ రక్షణ' అనే ప్రాంతీయ నినాదం మళ్లీ ఒక బలమైన ప్రత్యామ్నా యంగా ఎదిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలు, విభజన హామీల అమలులో జాప్యం వంటి అంశాలు ప్రజల్లో మళ్లీ ప్రాంతీయ అస్మితను రగిలిస్తున్నాయి.

కేవలం పేరు మార్పుతోనే విజయం సాధ్యం కాదు. 2001 నాటి పరిస్థితులకు, 2026 నాటి రాజకీయాలకు ఎంతో వ్యత్యాసం ఉంది. నాడు 'రాష్ట్ర సాధన' ఏకైక లక్ష్యం. నేడు 'రాష్ట్ర అభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణ' ప్రధానాంశం. తెలంగాణ రక్షణ సేన తన సిద్ధాంతాన్ని కేవలం సెంటిమెంటుకే పరిమితం చేయకుండా, నిరుద్యోగిత, వ్యవసాయ సంక్షోభం, మరియు పారదర్శక పాలన వంటి సమకాలీన అంశాలపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాల్సి ఉంటుంది. కవిత నాయకత్వం ఈ కొత్త వేదిక ద్వారా యువతను, మేధావులను ఏ విధంగా తనవైపు తిప్పుకుంటుందనే దానిపైనే ఈ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఉద్యమ కాలం నాటి సామాజిక సమీకరణాలను తిరిగి నిర్మించడం అంత సులభం కాదు, కానీ టి.ఆర్.ఎస్ అనే బ్రాండ్ ఇమేజ్ ఈ ప్రక్రియకు గట్టి పునాది వేయగలదు.

ముగింపుగా చూస్తే, "తెలంగాణ రక్షణ సేన" ఆవిర్భావం అనేది తెలంగాణ రాజకీయాల్లో ఒక చారిత్రక ఆవశ్యకతగా మారు తుందా లేక ఒక తాత్కాలిక రాజకీయ ఎత్తుగడగా మిగిలిపోతుందా అనేది కాలమే నిర్ణయించాలి. కానీ, 'తెలంగాణ' అనే పదం చుట్టూ తిరిగే రాజకీయాలు ఈ రాష్ట్రంలో ఎప్పుడూ సజీవంగానే ఉంటాయని ఈ పరిణామం మరోసారి రుజువు చేసింది. అస్తిత్వ పోరాటం నుంచి అధికార స్థాపన వరకు ప్రయాణించిన టి.ఆర్.ఎస్ అనే అక్షరాలు, ఇప్పుడు 'రక్షణ' అనే బాధ్యతను భుజాన వేసుకుని కొత్త పంథాలో పయనించడానికి సిద్ధమవుతున్నాయి. ఇది బి.ఆర్.ఎస్ పునరుజ్జీవనానికి దారితీస్తుందా లేక ఒక కొత్త రాజకీయ ధృవంగా అవతరిస్తుందా అన్నది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ పరిణామాల ద్వారా స్పష్టమవుతుంది. తెలంగాణ మట్టి వాసన, ప్రాంతీయ ఆత్మగౌరవం పునాదిగా పుట్టుకొచ్చే ఏ శక్తినైనా ఇక్కడి ప్రజలు ఆదరిస్తారనే నమ్మకమే ఈ కొత్త ప్రయత్నానికి వెన్నుముక. రాబోయే రోజుల్లో కవిత రాజకీయ వ్యూహాలు మరియు ఈ కొత్త టి.ఆర్.ఎస్ వేసే అడుగులు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికరమైన రాజకీయ సమీకరణాలకు వేదిక కానున్నాయి.

**వ్యాసకర్త : రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్, 9440595494**

# మున్నేరు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- తీగల వంతెన, రిటైనింగ్ వాల్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 30 : మున్నేరు నది పై చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. తీగల వంతెన నిర్మాణంతో పాటు రిటైనింగ్ వాల్ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, భూ నిర్వాసితుల కోసం అభివృద్ధి చేస్తున్న లేఔట్ వెంచర్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ గృహకల్ప, రంగనాయక గుట్ట, ప్రకాష్ నగర్ చెక్ డ్యాం ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిపుణుల కమిటీ రూపొందించిన డిజైన్ ప్రకారం రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, ఎడమ, కుడి వైపుల పనులు ఎటువంటి గ్యాప్‌లు లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వెంచర్‌కు ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని తెలిపారు. మున్నేరుపై నిర్మాణంలో ఉన్న కేబుల్ బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నిర్ణీత గడువులో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణంతో ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్‌డబీ ఎస్‌ఈ యాకుబ్, ఇరిగేషన్ డీఈ రమేష్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు వాణి, పుష్పలత, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు జయచందర్, వినయేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.



# ఖమ్మం కలెక్టర్‌ను కలిసిన టీజీవో కార్యవర్గం

**జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం - టీజీవో హామీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 30 : ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టి.ఎస్‌ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) జిల్లా కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. గురువారం టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి నాయకత్వంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో ఖమ్మంను రాష్ట్రంలో ముందువరుసలో నిలిపేందుకు గెజిటెడ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీజీవో ముందుండి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేష ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కనపర్తి వెంకటేశ్వరరావు, బి. హరీష్, డి.బాలాజీ, తాజుద్దీన్, ఎం.సతీష్, బి.శారద, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నారి విజయలక్ష్మి, బి. కిషోర్ బాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు శ్రీకాంత్, రామయ్య, పవన్ కుమార్, డాక్టర్ వేణుమాధవ్, డీసీహెచ్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, సీపీఓ శ్రీనివాసరావు, డీఎస్ఓ చందన్ కుమార్, డీపీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# చర్ల సీహెచ్‌సీలో 6 నెలల్లో 100 శస్త్రచికిత్సలు

**గిరిజన ప్రాంత ప్రజలకు వరంగా మారిన ప్రభుత్వ ఆసుపత్రి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : చర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆరు నెలల్లో 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి వైద్య సేవల్లో కీలక మైలురాయిని సాధించింది. ఇటీవల ఏర్పాటు చేసిన సదుపాయాలతో స్థానిక గిరిజన ప్రాంత ప్రజలకు ఈ ఆసుపత్రి ప్రధాన ఆరోగ్య కేంద్రంగా మారింది. గతంలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో శస్త్రచికిత్సల కోసం రోగులు 56 కిలోమీటర్ల దూరంలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం చర్లలోనే సిజేరియన్ శస్త్రచికిత్సలు, ట్యూబెక్టమీలు, టిఫా స్కానింగ్ వంటి సేవలు అందుబాటులోకి రావడంతో రోగులకు భారీగా ఉపశమనం లభించింది. భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు సూచనల మేరకు, అప్పటి కలెక్టర్ జితేశ్ పాటిల్ ప్రత్యేక చొరవతో ఆరు నెలల క్రితం నూతన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సమకూర్చారు. ప్రసూతి, శిశు, మత్తు వైద్య నిపుణులను నియమించడం ద్వారా సేవలను విస్తరించారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించి రేడియాలజిస్ట్‌ను నియమించడంతో పాటు అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా అదనపు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. డీసీహెచ్‌ఎస్ డా. రవి బాబు మాట్లాడుతూ, మరింత విస్తృత సేవలందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సల మైలురాయి సాధించిన వైద్య బృందాన్ని అభినందించారు. త్వరలో నిర్మాణంలో ఉన్న 30 పడకల నూతన భవనం పూర్తైతే మరింత మెరుగైన సేవలు



అందించగలమన్నారు. చర్ల ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతుండటంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీ మహిళలకు సమీపంలోనే వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రయాణ ఇబ్బందులు, ఖర్చులు గణనీయంగా తగ్గాయని తెలిపారు.



# పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : పోలీస్ శాఖలో దీర్ఘకాలంగా సేవలందించి పదవీ విరమణ పొందిన ఆరుగురు అధికారులను గురువారం భద్రాద్రి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించిన ఈ అధికారులు తమ విధుల్లో చూపిన నిబద్ధతకు అధికారులు ప్రశంసలు కురిపించారు. పదవీ విరమణ పొందిన వారిలో కొమరారం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ బి. తాతారావు, డీఏఆర్‌లో ఏఎస్ఐ టి. వెంకట్రావు, అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ టి. వెంకట సుబ్బారావు, ఇల్లందు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ అబ్దుల్ ఘని, డీఏఆర్‌లో ఏఆర్‌ఎస్ఐ కొరసా నాగేశ్వరరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీరామ్ ఉన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు వీరికి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మల్లయ్య స్వామి మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన అధికారులు తమ అనుభవాన్ని కొత్తగా చేరిన సిబ్బందికి స్ఫూర్తిగా నిలపాలని సూచించారు. అలాగే పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకర అలవాట్లు అలవర్చుకోవాలని సూచిస్తూ, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, ఎంటిఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, ఏప్రిల్ 30 :ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెర్ప్ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ భారతి లతో కలిసి హాజరై స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను విస్తరించాలని తెలిపారు. పెట్రోల్ బంకులు, డెయిరీలు, సోలార్ పవర్ ప్లాంట్లు, స్టిచింగ్, ప్లంబింగ్ వంటి రంగాల్లో మహిళలు ముందుకు రావాలని తెలిపారు. మహిళల సామర్థ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం 100 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, సహాయక సంఘాల మహిళలు ఇందులో పాల్గొని సర్టిఫికెట్ పొందిన అనంతరం వారి నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న రంగాలను గుర్తించి సహాయక సంఘాలు తమ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన మహిళా శక్తి భవన్‌ను శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని, ప్యాడీ కమిషన్‌లో సుమారు 65 శాతం స్వయం సహాయక సంఘాలకు చేరిందని తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి, వచ్చే పంట సీజన్‌కు అవసరమైన విత్తనాల ఎంపికలో స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిలో ఉందని, జిల్లా సమాఖ్య సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. మెషిన్, సెంట్రింగ్, సిమెంట్ ఇటుక యూనిట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యూనిట్ల స్థాపనకు ఇందిరా మహిళా శక్తి పథకం, పిఎంఎఫ్ఎం ఈ ద్వారా ఆర్థిక సహాయం, శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ముప్పు : మన నిర్లక్ష్యం జంతువుల ప్రాణాలపై ప్రభావం

**- అంతర్వేదిలో హృదయ విదారక ఘటన - ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న జంతువులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల, ఏప్రిల్ 30 : ఇటీవల కనిపించిన హృదయ విదారక దృశ్యం సమాజానికి గట్టి హెచ్చరికగా నిలిచింది. ఆహారం కోసం తిరిగిన ఒక పశువు, మనం నిర్లక్ష్యంగా పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారం అనుకుని మింగి చివరకు ప్రాణాలు కోల్పోయింది. శరీరం కుళ్లిపోయి అస్థిపంజరం మాత్రమే మిగిలిపోయినా, ప్లాస్టిక్ మాత్రం అలాగే కనిపించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇది ఒక్క సంఘటన మాత్రమే కాదు... ప్రతిరోజూ దేశవ్యాప్తంగా వేలాది జంతువులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. గేదెలు, కుక్కలు,మేకలు, పక్షులు... ఏ జీవి అయినా ప్లాస్టిక్ ముప్పు నుంచి తప్పించుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.ప్లాస్టిక్ మన జీవితాన్ని సులభతరం చేసినా, అదే ఇప్పుడు ప్రకృతికి శాపంగా మారింది. ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, బాటిల్స్ వందల సంవత్సరాలు విచ్ఛిన్నం కాకుండా నేల, నీరు, గాలిని కలుషితం చేస్తూ జీవవ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ప్లాస్టిక్ మింగిన జంతువులు కడుపు నిండిన భావనతో నిజమైన ఆహారం తినలేక ఆకలితో అలమటించి చివరకు మరణిస్తాయి. పక్షులు ప్లాస్టిక్ ముక్కలను ఆహారం అనుకుని తింటాయి; సముద్ర జీవులు ప్లాస్టిక్ వలల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతాయి. ఈ విధంగా మన నిర్లక్ష్యం ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తోంది. అంతేకాకుండా ప్లాస్టిక్ చిన్న కణాలుగా విడిపోయి 'మైక్రోప్లాస్టిక్' రూపంలో మన ఆహార గొలుసులోకి చేరి, మన ఆరోగ్యానికీ ప్రమాదంగా మారుతోంది.

**మార్పు మన చేతుల్లోనే**

ఈ పరిస్థితిని మార్చడం మన చేతుల్లోనే ఉంది. ప్లాస్టిక్ సంచుల బదులు వస్త్ర సంచులు ఉపయోగించడం, ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్‌ను తగ్గించడం, చెత్తను సక్రమంగా పారవేయడం, పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడం, గ్రామ--పట్టణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజల సహకారం లేకుండా పూర్తి పరిష్కారం సాధ్యం కాదు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి ముందుకు రావాలి. "ప్రకృతిని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడుకోవడం" అనే సత్యాన్ని గుర్తుంచుకొని, ప్లాస్టిక్‌ను తగ్గించి ప్రకృతిని కాపాడుకుందాం... జంతువుల ప్రాణాలను రక్షిద్దాం... మన భూమిని మనమే సంరక్షిద్దాం.



# పదవ తరగతి పరీక్ష ఫలితాలో మెరిసిన ఆణిముత్యాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 30 : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసి ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ ఆశ్రమ 13పాఠశాల లు నూరు శాతం ఉ త్తిర్ణత సాధించడం అందులో జైనూర్ ఆశ్రమ పాఠశాల బాలికల లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను ఎమ్మెల్యే కోవలక్ష్మి తన నివాసం లో వారి తల్లి తండ్రులకు శాలువాతో సన్మానం చేసి అభినందించారు. జిల్లా కలెక్టర్ హరిత ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శాలువాతో సన్మానించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఇదే స్ఫూర్తితో చదవాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖా ఉప సంచాలకులు ఆర్. రమాదేవి. పిఎంఆర్‌సి ఏసిఏంఓ పూర్కా ఉద్ధవ్, జిసిడిఓ కొట్నాక్ శకుంతల, ఏటీడీఓలు చిరంజీవి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఆత్రం పార్వతి, జి అశోక్, కోడెం రవీందర్, ఎస్‌సిఆర్‌పిలు కూడ్మేత. అనంత్, రాథోడ్ రవీందర్ లను ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖా ఆశ్రమ పాఠశాల లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని ఇదే స్ఫూర్తి తో ముందుకు వెళ్లి అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయుల పనితీరుని కొనియాడారు. ఉపాధ్యాయులకృషి తో ఫలితాలు సాధించారాని విద్యార్థులకు భవిష్యత్ లో ఉన్నత చదువుకు ఎటువంటి సహాయం కావాలన్నా వారికీ అండగా ఉం టానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్‌సి ఏసీఎంఓ పూర్కా ఉ ద్ధవ్, జిసిడిఓ కొట్నాక్ శకుంతల ఏటీడిఓలు చిరంజీవి, శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఆత్రం పార్వతి, జి.అశోక్, కోడెం రవీందర్ ఎస్‌సి ఆర్‌పిలు కూడ్మేత అనంత్, రాథోడ్ రవీందర్ ఉపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ గణన ప్రక్రియ ద్వారా జనగణన వేగవంతం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల (హాజీపూర్), ఏప్రిల్ 30 : జనగణన-2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ ద్వారా కార్యక్రమం వేగవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బెపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన, 2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు జరగనున్న స్వీయ గణన ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో https://se.census.gov.in వెబ్ సైట్ ద్వారా స్వీయ



గణన చేసుకోవచ్చని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నెంబర్ వినియోగించాలని, ఇండ్ల గణనకు సంబంధించి 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి రివ్యూ ద్వారా పరిశీలించుకోవాలని తెలిపారు. మే 11వ తేదీ నుండి ఇండ్ల గణన అధికారులు కార్యక్రమంలో భాగంగా ఇంటికి వచ్చినప్పుడు ఈ నెంబర్ ను అందించాలని తెలిపారు. ఆ సమయంలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే ఎన్యుమరేటర్ ద్వారా సవరించుకోవచ్చని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో తమకు కేటాయించిన బ్లాక్ లలోని ఇండ్లను సందర్శించేలా కార్యచరణ రూపొందించుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు.అంతకుముందు హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి సుమన్ తో కలిసి సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురిహౌకాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. గర్భిణుల ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగే విధంగా ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హిందువులారా హిందూ సమ్మేళనంకు తరలి రండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 30 : రామగుండం పట్టణం అంబేద్కర్ చౌక్ డి టైప్ జెన్కో గ్రౌండ్లో మే 3న ఆదివారం తలపెట్టిన హిందూ సమ్మేళనంకు హిందూ కుటుంబ సభ్యులు బంధువులు పరివారం భారీగా కదిలి వచ్చి విజయవంతం చేయాలని హిందూ సంభందన సమితి రామగుండం పట్టణ ఉత్సవ కమిటీ అధ్యక్షులు తూండ్ల శ్రీనివాస్ సెక్రటరీ రాపోలు కుసుమకుమారి ట్రెజరర్ కంద లోకనాథం కరాటే మాస్టర్ వడ్డేపల్లి సురేష్ కోరారు కులాలు ప్రాంతాలు వృత్తులు రాజకీయ పార్టీలు వేరైనా మనమంతా హిందువులం అనే భావన కలిగి జీవించినప్పుడే మన దేశాన్ని ధర్మాన్ని ఆలయాలను ఆడబిడ్డలను రక్షించుకోగలమని శ్రీనివాస్ కుసుమకుమారి లోకనాథం సురేష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేల నంకు హిందువుగా ప్రతి ఒక్కరూ తరలివచ్చి భక్తి సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేందుకు సహకరించి విజయవంతం చేయాలని వారు కోరారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 30 : వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల 1, తిమ్మాపూర్ గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ,హొతూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత ఆన్ లైన్ లో ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాగింగ్ ఆటోమేటిక్ గా అవుతుందని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జిపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసినహొహొధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం



జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని 30 పడకుల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషెంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబ్, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉ ంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మే 10 వరకు స్వీయ గణన చేసుకోవచ్చు : జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 30 : జనాభా గణన 2027 లో భాగంగా మొదటి విడత కార్యక్రమములో భాగంగా మే 10 వరకు తమ ఇంటి వివరాలను స్వీయ గణన ద్వారా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో స్వీయ గణన , ఉపాది హామీ పథకం నఖిలి విత్తనాలు, మందులు,ఇందన కొరత, యాసంగి వరి ధాన్యము కొనుగోలు పై పత్రిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం.డెవిడ్ కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, ఆసిఫాబాద్ ఏర డి ఓ లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జనగణన -- మన అభివృద్ధి లో భాగంగా కేంద్రశీ చేపడ్తున్న జనాభా గణన-2027 భాగంగా మొదటి విడత లో మే 11 నుండి జూన్ 9 వరకు ఇళ్ళ గణన చేపడుతున్నందున ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటింటికి సందర్శించి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేస్తారని కలెక్టర్ అన్నారు. ఈ కార్య క్రమములో భాగంగా ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన ద్వారా తమ ఇంటి వివరాలు, 33 అంశాల వివరాలను ఆల్ లైన్ లో నమోదు చేసుకోవచ్చన్నారు. తరువాత ఎన్యుమరేతారు ఇంటిని సందర్శించినపుడు నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తారని స్వీయ గణనను సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 994 మంది ఎయుమ రేటర్లు 174 మంది సూపర్ వైజర్లు , 1689 హౌస్ లిస్టింగ్ బ్లాక్ లుగా గుర్తించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పతాకంలో పని ప్రదేశాలలో కూలీలకు నీడ,త్రాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలు ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల వరకు పనిని పూర్తి చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత నుండి రక్షిశీచుకోవలన్నారు. జిల్లాలో పెట్రోల్, డిజిల్ కొరత లేదన్నారు. డిమాండ్ కు తగ్గట్టు సప్లయ్ ఉందన్నారు. అవసరమైన పుకార్లను నమ్మవద్దన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులు జాగ్రత్తగా వుండాలన్నారు. నఖిలి పత్తి విత్తనాలు , మందులు కొనుగోలు చేయకూడదన్నారు. అనుమతి లేని విత్తానాలు, మందులు కొనుగోలు చేసిన, విక్రయించిన వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తానాలు మందులు కొనుగోలు చేసేటప్పుడు ఆన్ లైన్ రశీదులు తీసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు అవసరమైన మందులు కొనుగోలు ఒత్తిడి చేయకూడదన్నారు. యాసంగి వరి ధాన్యము కొనుగోలు పై పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రతి కొనుగోలు కేంద్రంలో త్రాగు నీరు, నీడా , వెలుతురూ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎ గ్రేడ్ ధాన్యానికి 3389 సాదారణ రకం ధాన్యానికి 2369 మద్దతు ధర వుందని, సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల బోనస్ వుందని కొనుగోలు , రైస్ మిల్లులకు తరలింపు పూర్తిగా డిజిటల్ యాప్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.స్వీయ గణన ఇళ్ళ గణన కార్యక్రమము విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కారు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవా రెడ్డి , వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సంపత్ కుమార్, సంబందిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా, కార్మిక, కళాకారుడు రాధాకృష్ణ ఉద్యోగ విరమణ

## ఘనంగా సన్మానించిన అధికారులు, ఆత్మీయులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 30 : గత 35 సంవత్సరాలుగా సింగరేణిలో విధులు నిర్వహిస్తూ, ఆర్జీ-3 ఓసిపి-1 గని సి.హెచ్.పి కన్వేయర్ ఆపరేటర్ గా ఉద్యోగ విరమణ పొందిన కొంద్ర రాధాకృష్ణ ను గని అధికారులు, కార్మికసంఘాల నాయకులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గురువారం ఓసిపి-1 గని సి.హెచ్.పి ఆవరణలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి డిజియం శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వైవి.రావు ముఖ్య అతిథులుగా హాజరై రాధాకృష్ణ ను ఘనంగా సన్మానించగా, అన్ని కార్మికసంఘాల నాయకులు, సూపర్వైజర్లు, అన్ని సెక్షన్ల కార్మికులు, కార్మికురాళ్ళు, సింగరేణి కళాకారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాధాకృష్ణ ఉద్యోగిగా బొగ్గు ఉత్పత్తి-ఉత్పాదకతలో కీలక భూమిక పోషిస్తూనే కళాకారుడిగా, క్రీడాకారుడిగా కోల్ ఇండియా స్థాయిలో బహుమతులందుకొని, సింగరేణి కీర్తి పతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేశారని కొనియాడారు. రాధాకృష్ణ కళాకారుడిగా సందేశాత్మక లఘు నాటికలలో నటిస్తూ, రక్షణ గేయాలను ఆలపిస్తూ, కార్మికులను చైతన్యపరిచే కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనేవాడని ప్రశంసించారు. రాధాకృష్ణ ప్రతిభావంతుడైన కళాకారుడు, క్రీడాకారుడు కాబట్టే పార్టీలు,



యూనియన్లకతీతంగా అన్ని కార్మిక సంఘాలు, పార్టీల నాయకులు, సింగరేణివ్యాప్త కళాకారులు హాజరై గౌరవంగా సన్మానించారని పేర్కొన్నారు. రాధాకృష్ణ ను ఉద్యోగ విరమణ పేరిట కోల్పోవడం సంస్థకు నష్టదాయకమైనా.. ఉద్యోగ విరమణ అనివార్యమని అన్నారు. కాగా ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తన అనుచరవర్గంతో విచ్చేసి రాధాకృష్ణ ను ఘనంగా సత్కరించటం విశేషం. సింగరేణి కార్మికుల విశిష్టతను ప్రశంసిస్తూ ఇప్టా జాతీయ సమితి సభ్యులు కే.స్వామి,స్నేహం పై రాధాకృష్ణ ఆలపించిన గీతాలు కార్మికులను అలరించాయి. ఇంకా అధికారులు అరవింద్, మహేందర్, అనిల్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు రాములు, కిషన్, కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ, మేజిక్ రాజా, చంద్రపాల్, కృష్ణస్వామి, నారాయణ, రాజసమ్మయ్య, కట్టరాజుతోపాటు సి.హెచ్.పి.కార్మికులు పాల్గొన్నారు.

# కుక్కల గూడూరులో రైతులకు అవగాహన సదస్సు - రైతుల వద్దకే శాస్త్రవేత్తలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు పంటలు దిగుబడి కోసం అనుసరించాల్సిన విధానాలను ప్రతి రైతుకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన "99 రోజుల కార్య చరణ ప్రణాళిక"లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లోకి వచ్చి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పాలకుర్తి మండలం కుక్కల గూడూరులో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కరీంనగర్ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ హాజరై మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే రసాయన మందులను వాడటం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నేల నీరు గాలి కాలుష్యాన్ని నివారించే ప్రకృతిని కాపాడ వచ్చని అన్నారు సాగునీటిని పొదుపుగా వాడుకుంటూ వివిధ పంటలు సాగు చేయాలని సేంద్రీయ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండిం చాలని ఆయన రైతులకు సూచించారు. కూనారం వ్యవసాయ పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ బి.సతీష్ చంద్ర మాట్లాడుతూ రైతులకు అధిక సాగు బందులపై అవగాహన కల్పించడమే ఈ సదస్సులో లక్ష్యమని అన్నారు. రైతులు యూరియా రసాయన



ఎరువుల వాడకాన్ని తగ్గించి పంట వైవిధ్యీకరణ పాటించాలని సూచించారు. మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన రకాలను సాగు చేస్తే రైతులకు సకాలంలో ప్రభుత్వ బోనస్ మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ ధ్రువీకృత విత్తనాలనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# టియూడబ్ల్యూజే మహాసభను విజయవంతం చేయాలి

## యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (గోవిందరావుపేట) ఏప్రిల్ 30 : టియూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బస్సాపూర్ సమీపంలోని విరించి రిసార్ట్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్,కార్యదర్శి చిదురాల వాసుదేవ్ ల అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతి మండలంలో ఐజేయూ సంఘం సభ్యుల సంఖ్య ఎక్కువ మొత్తంలో ఉండే విధంగా నాయకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ములుగు జిల్లా ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు.సంఘం సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిరంతరం శ్రమిస్తుందని అన్నారు.మే 15న ములుగు జిల్లా కేంద్రంలో ఐజేయు మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు



పూర్తి చేయాలని స్థానిక నాయకత్వానికి ఆయన సూచించారు.జిల్లాలోని అన్ని మండలాల నుంచి సంఘం సభ్యులను అధిక సంఖ్యలో తరలించి మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మహాసభ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం తో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్ హాజరుకానున్నారని,ఆయన పేర్కొన్నారు.స్థానిక ఐజయు నాయకత్వం కలిసికట్టుగా మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం పలు అంశాలపై ఆయన స్థానిక యూనియన్ నాయకులతో చర్చించారు.ఈ సమావేశంలో ఐజేయు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎలగందుల కొమురయ్య,జిల్లా ఉపాధ్యక్షులు భేతి సతీష్ యాదవ్,గంపల శివ,సంయుక్త కార్యదర్శి చుంచు రమేష్, గూగుల మోడీ హరికృష్ణ, కోశాధికారి బైకానీ నటరాజ్, దాడుల వ్యతిరేక కన్వీనర్ జాలిగం శ్రీనివాస్,చిన్న పత్రికల ప్రధాన కార్యదర్శి ఎనుగందుల. శంకర్,జింకల ప్రభాకర్, గోల్కొండ రాజు,ముంద్రాతి ప్రతాప్,కుదురుపాక ప్రవీణ్ అశోక్, పతంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, ఏప్రిల్ 30 : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల సాయికుంట ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

## -కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మురళి నాయక్

## -మాజీ డిసిసి అధ్యక్షుడు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 30 : గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు ఏ ఒక్క సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. మల్యాల కి చెందిన వంద కుటుంబాలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో కబ్జాలు దోపిడీలు రౌడీషీటర్ల పాలన కొనసాగిందే తప్ప పేద మధ్యతరగతి కుటుంబాలకు ఈసమెత్తు లాభం జరగలేదని అన్నారు. రేవంత్ సర్కార్ ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు ప్రజా పాలనకు ఆకర్షితులై వంద కుటుంబాలను ఎమ్మెల్యే,కాంగ్రెస్ కండువాను కప్పి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరు రాహుల్ గాంధీని ప్రధాని చేసే వరకు కంకణ బద్ధులై పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా నాయకులు ప్రకాష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి,ఉమ్మడి మల్యాల గ్రామ పంచాయతీ సర్పంచులు,మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి నీడ కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం

## - కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల , ఏప్రిల్ 30 : తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం ఇల్లు లేకుండా ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం కోరుట్ల నియోజక వర్గంలో పరిధిలోని కోరుట్ల పట్టణ భీముని దుబ్బ, మల్లాపూర్ మండలం చిట్టాపూర్, ముత్యంపేట తదితర గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినటువంటి ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుకున్న లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు గృహప్రవేశం చేసిన దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల రోజు పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు ఏ విధంగా చేపడితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బు జమ అవుతాయని తెలిపారు. ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంపతి శంకరమ్మ ఆశాలు గోరుముంతల ప్రవీణ్, కౌన్సిలర్ తోట గంగాధర్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు జలపతి రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, చల్ల లింగం, వాకిటి భూమారెడ్డి, అల్లూరి శ్రీనివాసరెడ్డి, చిట్టాపూర్ ఉప సర్పంచ్ బాలసాని ప్రణయ్ గౌడ్, కొత్త పెల్లి రాజారెడ్డి, రాజేందర్, ఇట్టడి శంకర్, ప్రణయ్, తెడ్డు విజయ్, పాశం నవ్య, పబ్బతి రాజేష్, ఎల్లాల రాజేష్, చింతామణి, గడ్డం లింగారెడ్డి, ఏలేటి వెంకటరెడ్డి, శ్రవణ్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టేక్మాల్ మండల టాపర్‌కు దళిత సంఘా నాయకులు సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ ఏప్రిల్ 30:- కష్టపడి చదివే సంకల్పం ఉంటే పేదరికం ఏమాత్రం అడ్డుకాదని అచ్చన్నపల్లి విద్యార్థి తుడుం కళ్యాణ్ కుమార్ నిరూపించాడు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 572 మార్కులు సాధించి, టేక్మాల్ మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. మండల టాపర్ గా కళ్యాణ్ కుమార్ సాధించిన ఈ అద్భుత విజయాన్ని గుర్తించిన దళిత నాయకులు, ఎంపీపీ కార్యాలయ ఆవరణలో విద్యార్థిని ఘనంగా శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా దళిత నాయకుడు సాయిలు మాట్లాడుతూ, కళ్యాణ్ కుమార్ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అచ్చన్నపల్లి వంటి మారుమూల గ్రామంలోని దళిత కుటుంబంలో జన్మించిన కళ్యాణ్, సరైన రవాణా సౌకర్యాలు లేకపోయినా అధైర్యపడలేదు. ఎలకుర్తి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించేందుకు ప్రతిరోజూ ఇంటి నుండి నాలుగు కిలోమీటర్లు వెళ్లడం, తిరిగి మరో నాలుగు కిలోమీటర్లు నడవడం.. ఇలా నిత్యం 8 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి విద్యను అభ్యసించాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అవకాశాలుగా మలుచుకుని, పేదరికాన్ని వెనక్కి నెట్టి అత్యుత్తమ ఫలితాన్ని సాధించాడని వారు ప్రశంసించారు. పేదరికం విద్యకు ఆటంకం కాదని చెప్పడానికి కళ్యాణ్ కుమార్ ఒక సజీవ సాక్ష్యమని సాయిలు పేర్కొన్నారు. కళ్యాణ్ సాధించిన ఈ ప్రతిభను చూసి గ్రామస్తులు మరియు మండల ప్రజలు గర్విస్తున్నారు. ఈ కార్యక్రమంలో బాగయ్య, ఎల్లయ్య, శంకరయ్య, అశోక్, దుర్గేష్ ఉన్నారు.

# రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా కరీంనగర్ జట్టు

**- రామకృష్ణాపూర్‌లో ముగిసిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్**

**- ఫైనల్‌లో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌పై 1-0తో ఘనవిజయం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 30 : మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ వేదికగా ఏప్రిల్ 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన రాష్ట్ర స్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ బుధవారం ఘనంగా ముగిసింది. డీఎఫ్ఏ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జిల్లా జట్టు, రంగారెడ్డి జిల్లాకు చెందిన బలమైన హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ జట్టుతో తలపడింది. ఆట ఆరంభం నుంచే ఇరు జట్లు హోరాహోరీగా పోటీ పడ్డాయి. అయితే కరీంనగర్ క్రీడాకారిణులు వ్యూహాత్మకంగా ఆడుతూ కీలక సమయంలో గోల్ సాధించి 1-0 తేడాతో విజయం సాధించారు. ఈ విజయంతో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డబ్ల్యూ గణపతి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నాయుడు, ఉపాధ్యక్షులు డబ్ల్యూ. వెంకట రావు కరీంనగర్ జట్టును ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారిణులు చూపిన క్రమశిక్షణ, పట్టుదల, క్రీడా స్ఫూర్తి గర్వకారణమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ చూపించి జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా జట్టును విజయపథంలో నడిపించిన హెడ్ కోచ్ డబ్ల్యు విజయ్, అసిస్టెంట్ కోచ్ బొంతు రేవంత్ చేసిన కృషిని అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. క్రీడాకారిణుల నిరంతర శ్రమ, క్రమబద్ధమైన శిక్షణ, జట్టు సమన్వయం వల్లే ఈ విజయం సాధ్యమైందని హెడ్ కోచ్ విజయ్ తెలిపారు. ఈ విజయానికి రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రోత్సాహం కూడా ప్రధాన కారణమని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ విజయంతో కరీంనగర్ జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో తన సత్తాను మరోసారి చాటుకుంది.

# దారిమైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 30 : రామగుండం రాజీవ్ రహదారి బుగ్గ ఎక్స్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన దారి మైసమ్మ ఆలయాన్ని గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ సందర్శించారు. నూతన దారి మైసమ్మ ఆలయాన్ని స్వయంగా నిర్మించిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈరోజు ఆలయ ప్రాంగణాన్ని కలియ తిరుగుతూ భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ దారి మైసమ్మ ఆశీర్వాదాలు అందరికీ ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన సాగుతోంది

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 30 : జగిత్యాల మండలం బాలపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన బేతి భూమారెడ్డి దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి గురువారం గృహప్రవేశం సందర్భంగా వారి ఆహ్వానం మేరకు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపి, చీరను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా పాలన సాగుతుందన్నారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే నూతన పథకాలు అమలు చేయడం జరుగుతుందని, రేషన్ కార్డులు, ఉచిత బస్సు, 200 యూనిట్ల కరెంటు, సన్న బియ్యం ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని అన్నారు. గ్రామంలో 40 మందికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేయటం జరిగిందని, బాలపల్లి హైదర్ పల్లి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా నని పేర్కొన్నారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా...ప్రతి ఒక్కరూ వారి ఇంటివద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి అన్నారు. చెరువు బాగుంటే ఊరు బాగుంటుంది అని చెరువులను పరిరక్షించుకోవాలని మురుగు నీరు చేరకుండా చూడాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఏక కాలంలో రుణ మాఫీ,రైతు భరోసా అమలు చేస్తుంది అని,సన్న వడ్ల సాగు పెంచడానికి వడ్లు 500 బోనస్ ఇస్తుంది అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా ముఖ్యమంత్రి అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, నాయకులు బాల ముకుందం మండల సర్పంచుల ఫోరమ్ కట్టరాజేందర్, సర్పంచ్ లు గుంటి రవి, బొడ్డు దామోదర్, నాయకులు బొక్కల గంగారెడ్డి, కడ మహేష్, బి.చిరంజీవి, బోయ గంగాధర్, గుంటి గంగమల్లయ్య, చెట్టే మల్లేష్, మేడపట్ల సురేష్, గణేష్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు చర్యలు

**- ప్రజలకు నిరంతర సరఫరా ఉండాలి**

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరిక**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : జిల్లాలో పెట్రోల్, డీజిల్ లభ్యతపై తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పెట్రోల్ బంక్ యజమానులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంధన సరఫరా నిరంతరం కొనసాగాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెట్రోల్ బంక్ నిర్వాహకులు అన్ని వేళలా అందుబాటులో ఉండి పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరా చేయాలని సూచించారు. చమురు కంపెనీలకు ముందస్తుగా ఇండెంట్లు సమర్పించి నిల్వలను సమృద్ధిగా ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన బీపీసీఎల్, ఐఓసీఎల్ సేల్స్ అధికారులు పాల్గొనగా, హెచ్‌పీసీఎల్ ప్రతినిధి గైర్హాజరు కావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు తమ సమస్యలను వివరించి, ఇండెంట్లు సమర్పించినప్పటికీ చమురు కంపెనీలు సకాలంలో సరఫరా చేయడం లేదని, కొన్ని సందర్భాల్లో ఇండెంట్లు రద్దు చేసి మళ్లీ వేయమంటున్నారని తెలిపారు. ఈ అంశాలపై స్పందించిన కలెక్టర్, ప్రజల నిత్యవసరాలు, వ్యవసాయం, పరిశ్రమల అవసరాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఇంధన సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు అమ్మకం వంటి అక్రమ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ. ప్రేం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**- రైతుకు రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయాలి - నేచురల్ ఫామింగ్ పై రైతులకు అవగాహన కల్పించాలి - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 30 : వచ్చే సీజన్లో జిల్లా రైతులు వరి ధాన్యమే కాకుండా ఇతర వాణిజ్య పంటలు, ఉద్యానవన, మల్బరీ, ఆయిల్ పామ్ తదితర పంటల వైపు మొగ్గు చూపే విధంగా చైతన్య పరచాలనీ జిల్లా కలెక్టర్ అధికారులతో అన్నారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ, ఉద్యానవన, ఐకెపి సంబంధిత అధికారులతో ఉద్యానవన, ఆయిల్ పామ్ పంటల సాగు, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ, ఫార్మర్ రిజిస్ట్రీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక లాభాలు వస్తున్న నేపథ్యంలో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలను సాగు చేస్తే దేశీయ మార్కెట్లో చాలా డిమాండ్ ఉన్నాయని అందుకు అనుగుణంగా రైతులు పంటలు వేస్తే అధిక లాభాలు వస్తాయని అన్నారు, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మొక్కజొన్న, వరి కొయ్యలను మంటల్లో కాల్చకుండా చర్యలు తీసుకోవాలని పొలంలో వాటిని సేంద్రీయ ఎరువులుగా మార్చుకునే విధంగా చూడాలని, నేచురల్ ఫామింగ్ పై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు, క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయాలని పిఎం కిసాన్ ద్వారా లింకులు ఆన్లైన్ చేయాలన్నారు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ ఓ పట్టాల విషయంలో సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించి రైతుకు మేలు చేయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారని సరిత, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ఏడిఏ లు, ఏఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోచారంలో నీటి సమస్యలు, దోమల నివారణపై వినతి

## అధికారులకు బీఆర్ఎస్ నేతల ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్‌కేసర్, ఏప్రిల్ 30 : మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం వార్డులో నీటి సమస్యలు, దోమల పెరుగుదలపై తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు గురువారం వినతిపత్రం సమర్పించారు. పోచారం ప్రాంతంలో దోమల సమస్య అధికమవుతున్న నేపథ్యంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న వాటర్ మెన్, ఎలక్ట్రిషన్ల బదిలీలను నిలిపివేసి, వారిని యథాస్థానాల్లో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది మార్పులు జరిగితే సేవలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్బవత్తిని నర్సింహ, జితేందర్ నాయక్, వేమురెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమస్యలను పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగామయి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 30 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంపెనుబల్లి మండలంలో గురువారం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గంగదేవిపాడు, తుమ్మలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గంగదేవిపాడు గ్రామంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కాకా రామారావు గారి కుమారుడు సాజిత్ లతో పాటు సాయి శ్రావణి వివాహ వేడుకలలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అదే గ్రామంలో బన్నే వెంకటేశ్వరరావు గారి కుమారుడు రమేష్--మౌనిక, బానోత్ కృష్ణ గారి కుమారుడు వేణుగోపాల్--లక్ష్మీ మమత, అలాగే కొర్ర శ్రీను, దేవి గారి కుమారుడు నవీన్--పావని వివాహ వేడుకల్లో కూడా పాల్గొని ఆశీస్సులు అందించారు. అదేవిధంగా గంగదేవిపాడు గ్రామంలో మాలోత్ కృష్ణ గారి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.తర్వాత తుమ్మలపల్లి గ్రామంలో ఆంబోజి గోపి గారి కుమార్తెలు శరణి, సలోని ఓనిల అలంకరణ కార్యక్రమంలో పాల్గొనిచిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, ఏ యం ఎం సి వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, గంగదేవిపాడు గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పోట్లపల్లి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘట్‌కేసర్‌లో పోలీసుల వెహికల్ చెకింగ్

**హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి - ఎస్సై ప్రభాకర్ రెడ్డి సూచనలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్‌కేసర్, ఏప్రిల్ 30 : మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కనకూడ చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్‌హెచ్ఓ బాలస్వామి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు వాహన పత్రాలు ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ కట్టుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాఘవేందర్, హీనతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ఎక్సలెంట్ స్కూల్స్ ఘన విజయం

## ఎమ్మెల్యే పాయం, డీఎస్పీ చేతుల మీదుగా విద్యార్థులకు సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, ఏప్రిల్ 30:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పదో తరగతి ఫలితాల్లో విశిష్ట విజయాన్ని నమోదు చేసి మరోసారి తమ ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగాగురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ, ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మండల స్థాయిలో టాప్ స్థానాలను కైవసం చేసుకోవడం గర్వకారణమని తెలిపారు. కరస్పాండెంట్ మహమ్మద్ ఖాదర్ వివరాల ప్రకారం నరేందర్ 586 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, త్రిశాంత్, డీవీఎస్ఎన్ రాజు తలా 578 మార్కులు, జస్వంత్ 577, షణ్ముఖ ప్రియా 575 మార్కులు సాధించారు. స్పందన, ధరణి ప్రియా తలా 572,హంసిక్, మేఘన తలా 571, జీవన్ 570 మార్కులు సాధించిప్రతిభ కనబర్చారు. డైరెక్టర్లు జాన్ మియాఖాన్,యాకూబ్ షరీఫ్ మాట్లాడుతూ ఈ విజయాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఫలితమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీఎస్పీ రవీందర్ రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ శాలువాలు కప్పి మెమెంటోలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ప్రతిభ వెలుగులోకి రావడం ఆనందదాయకమని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం ఎక్సలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ లెనిన్ విజయ్ కుమార్, బయ్యారం ప్రిన్సిపాల్ సురేష్, నరేందర్, నర్సారెడ్డి, బోధనా సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోటగిరి పాపన్నకు 'దళిత రత్న' అవార్డు ప్రదానం

## రవీంద్ర భారతిలో ఘనంగా జయంతి ఉత్సవాల సన్మాన సభ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్ 30 : మహనీయుల జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభలో ఆది జాంబ వరుంధతి సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి పాపన్నకు 'దళిత రత్న' అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డును గౌరవ పార్లమెంట్ సభ్యులు పెద్దపల్లి గడ్డం వంశీకృష్ణ, మాజీ మంత్రి ఆగం చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు సునీల్ మాదిగ, గౌరవ అధ్యక్షులు పెరుమర్ల రామకృష్ణ, జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ రోజా రాణి, బుగ్గ మైసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వద్లూరి శ్రీనివాస్, కాంపెల్లి సతీష్ కుమార్, శనిగారపు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో కార్మిక సమస్యలపై ప్రాతినిధ్య సంఘంతో స్ట్రక్చర్ సమావేశం

## కార్మికుల సౌకర్యాలు, పదోన్నతులపై యాజమాన్యాన్ని ప్రశ్నించిన యూనియన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 30 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కార్మికుల సమస్యలపై యాజమాన్యం, ఐఎన్టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ మధ్య స్ట్రక్చర్ సమావేశం జరిగింది. గురువారం స్థానిక జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ సమావేశంలో కార్మికుల పలు సమస్యలను యూనియన్ ప్రతినిధులు యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. కేటీకే-6 ఇంక్లైన్ నుండి కేటీకే-1 ఇంక్లైన్, కేటీకే-8 ఇంక్లైన్ గనులకు ఉద్యోగులను తాత్కాలికంగా బదిలీ చేయడంతో, అక్కడ కార్మికుల కోసం షెడ్లు, సైకిల్ షెడ్లు పెంచాలని, పాత షెడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. సీఈఆర్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలన్న తమ డిమాండ్‌ను యాజమాన్యం పట్టించుకోవడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సింగరేణి భారత్ గ్యాస్ డెలివరీలో అదనపు వసూళ్లను అరికట్టాలని, కేటీకే-5 ఇంక్లైన్, కేటీకే-8 ఇంక్లైన్ గనుల్లో ల్యాంప్ రూమ్ ఇన్‌చార్జ్‌లను నియమించాలని సూచించారు. తక్కువ సిబ్బంది ఉన్న కేటికె.6 గనిలో ల్యాంప్ రూమ్ ఇంచార్జ్ ను ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి సింగరేణి కాలనీల్లో అధికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లలో కొన్నింటిని తొలగించి, మిగిలిన వాటికి సూచికలు ఏర్పాటు చేయాలని కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పదోన్నతులను త్వరితగతిన అమలు చేయాలని, అండర్‌గ్రౌండ్ గనులకు కొత్త లారీలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సిఎస్ఆర్ నిధుల కేటాయింపులో ప్రాతినిధ్య సంఘం పాత్రపై స్పష్టత ఇవ్వాలని, ఈ డివిజన్‌కు కేటాయించిన నిధుల వివరాలు వెల్లడించాలని కోరారు. ఈ సమావేశంలో సింగరేణి యాజమాన్యం తరపున ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఓటీయూ జీఎం ఎస్. కవీంద్ర, ఇన్‌చార్జ్ పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు. ఐఎన్టీయూసీ నుంచి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధూకర్ రెడ్డి, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు బొడ్డు అశోక్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

# ఆరోగ్యం



## ఇడ్లీ, దోశ,పూరీ అక్కర్లేదు..ఉదయం గుప్పెడు శెనగలతో ఆరోగ్యానికి తిరుగులేని బలం!

ప్రస్తుతం దాదాపు అందరిలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ముఖ్యంగా కరోనా తర్వాత నుంచే ఆరోగ్యంపై అటెన్షన్ అందరిలో వచ్చిందనే చెప్పాలి. అయితే ఆరోగ్యకరమైన జీవితం కోసం ఆరోగ్యకరమైన ఫుడ్ తీసుకోవడం తప్పనిసరి. ఏది పడితే అది తిని ఇది కూడా ఆరోగ్యకరమైనదే అని చాలామంది అనుకుంటారు..అయితే అది భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య పరిణామాలకు కారణమవుతుంది. సాధారణంగా మన తెలుగు ప్రజులు పొద్దన్నే ఇడ్లీ,దోశ, పూరీ,వడ,బోండా వంటివి ఎక్కువగా తింటుంటారు. అయితే వీటిన్నింటిన్ని వదిలి పొద్దున్నే గుప్పెడు నానబెట్టిన శెనగలు తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడు మేలు జరుగుతుంది. ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్, విటమిన్లు,మనరల్స్ పుష్కలంగా ఉండే శెనగలు మీ శరీరాన్ని శక్తివంతం చేయడమే కాకుండా అనేక వ్యాధుల నుండి కూడా కాపాడుతుంది. బలమైన జీర్ణవ్యవస్థ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో జీర్ణ సంబంధిత సమస్యలు చాలా కామన్ అయిపోయింది. అయితే నానబెట్టిన శెనగలు దీనికి చక్కటి పరిష్కారం చూపుతుంది. ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. పేగు కదలికలను సులభతరం చేసి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం సక్రమంగా జీర్ణం కావడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి,ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణ మధుమేహం లేదా షుగర్ అనేది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని వేధిస్తున్న ఒక తీవ్రమైన సమస్య. నానబెట్టిన శనగపప్పు బ్లడ్ లో షుగర్ లెవల్స్ ని కంట్రోల్ చేయడంలో సహాయపడుతుంది. దీనిలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. తద్వారా చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఒక అద్భుతమైన ఆహారం. బరువు తగ్గడంలో సాయం నానబెట్టిన శనగలు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇందులో ప్రోటీన్లు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉంటుంది. దీనివల్ల మీరు తరచుగా తినాలనే కోరికను నియంత్రించవచ్చు, అదనపు కేలరీలు తీసుకోకుండా ఉండవచ్చు. రోగనిరోధక శక్తి బలమైన రోగనిరోధక శక్తి మనల్ని అనేక వ్యాధుల నుండి కాపాడుతుంది. నానబెట్టిన శనగలలో ఐరన్, భాస్వరం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన మినరల్స్, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక కణాలను బలోపేతం చేస్తాయి. తద్వారా శరీరం ఇన్ఫెక్షన్లు,వ్యాధులతో సమర్థవంతంగా పోరాడగలదు.

గుండె ఆరోగ్యం నానబెట్టిన శనగలు మీ గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్ లో ఉండటం వల్ల గుండెపోటు, ఇతర గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది. చర్మం,జుట్టుకు మెరుపు ఆరోగ్యకరమైన చర్మం, మెరిసే జుట్టు కావాలని అందరూ కోరుకుంటారు. నానబెట్టిన శనగపప్పులో ఉండే ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు మీ చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి. అంతేకాకుండా ఇది జుట్టు మూలాలను బలోపేతం చేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది, ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది. నానబెట్టిన శనగపప్పును ఎలా తీసుకోవాలి? రాత్రిపూట ఒక కప్పు శనగపప్పును శుభ్రమైన నీటిలో నానబెట్టండి. ఉదయం లేచిన తర్వాత వాటిని బాగా కడిగి ఖాళీ కడుపుతో తినండి. మీ రుచికి అనుగుణంగా కొద్దిగా ఉప్పు, అల్లం ముక్కలు లేదా కావాలనుకుంటే తేనెను కూడా కలుపుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## వేల డాలర్లు పెట్టి కోట్ల మంది కొనే దుబాయ్ ఫేమస్ 'కునాఫా చాక్లెట్'.. ఈ ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకోండి



చాక్లెట్ అంటే ఇష్టపడనివాళ్లు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ ఫారిన్ చాక్లెట్స్ అంటే ఎగబడి తింటుంటారు కొందరు. అయితే దుబాయ్ ఫేమస్ అయిన కునాఫా చాక్లెట్ ని మీరెప్పుడైనా తిన్నారా? ఓ సారి తప్పక టేస్ట్ చేయాల్సిన చాక్లెట్ ఇది. చాలా చాలా టేస్టీగా ఉంటుంది. దుబాయ్ లోనే కాకుండా చాలా మిడిల్ ఈస్ట్ దేశాల్లో కూడా ఈ చాక్లెట్ ఫేమస్. వేల డాలర్లు పెట్టి ఈ చాక్లెట్ ను కొంటారు. ఈ ఖరీదైన చాక్లెట్ ను మీ ఇంట్లోనే మీరు సులభంగా తయారుచేసుకోవచ్చు. అదెలాగో ఇక్కడ చూడండి.

కునాఫా చాక్లెట్ తయారీకి కావాల్సిన పదార్థాలు -ఆయిల్ బేస్ట్ గ్రీన్ కలర్ -ఆయిల్ బేస్ట్ ఎల్లో కలర్ -వైట్ చాక్లెట్ -చాక్లెట్ మౌల్డ్స్ -పిస్తా -నువ్వులు -ఆయిల్ -పాలు -చక్కెర -ఉప్పు -డార్క్ చాక్లెట్ కాంపౌండ్ -వైట్ చాక్లెట్ కాంపౌండ్ -వెన్నిలా ఎసెన్స్ -కునాఫా స్పెషల్ సేమియా.

కునాఫా చాక్లెట్ తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద ఓ గిన్నెలో పెట్టి అందులో కొన్ని నీళ్లు పోయాలి. ఈ గిన్నె మీదనే ఓ బౌల్ పెట్టి అందులో 2-3 టేబుల్ స్పూన్ల సన్నగా తరగుక్కున్న వైట్ చాక్లెట్ వేసి కరిగించాలి. -కరిగించిన వైట్ చాక్లెట్ మిశ్రమాన్ని రెండు గిన్నెల్లోకి సగం సగంగా తీసుకోండి. ఒక గిన్నెలోని చాక్లెట్ మిశ్రమంలో ఆయిల్ బేస్ట్ గ్రీన్ కలర్..ఇంకో గిన్నెలో ఆయిల్ బేస్డ్ పసుపు కలర్ వేసుకొని కలపాలి. -తర్వాత చాక్లెట్ మౌల్డ్స్ తీసుకొని అందులో కలిపి ఉంచిన ఈ పసుపు, గ్రీన్ కలర్ మిశ్రమాన్ని చల్లినట్లుగా వేసి 10 నిమిషాలు ఫ్రిడ్జ్ లో పెట్టయాలి.

-ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 50 గ్రాముల పిస్తా వేసి తక్కువమంట మీద లైట్ గా దోరగా వేయించి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద ఉన్న పాన్ లోనే నీళ్లు వేడి చేసి ఇందులో వేయించిన పిస్తా వేసి 2-3 నిమిషాలు ఉడికించుకోవాలి. తర్వాత ఈ పిస్తాని ఈ నీళ్లలో వేసి కొంచెం బాయిల్ అయ్యాక స్టవ్ మీదనుంచి దించేయాలి. -ఇప్పుడు పిస్తాని చల్లటి నీళ్లలో వేసి పిస్తా పైన ఉండే తొక్కను తీసేయాలి.

-తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 1 టేబుల్ స్పూన్ నువ్వులు వేసి దోరగా చిటపటలాడేదాకా వేయించిన తర్వాత దీనిని మిక్సీ గిన్నెలో వేసి,ఇందులోనే చిటికెడు ఉప్పు, 2 టేబుల్ స్పూన్ల చక్కెర వేసి మెత్తగా ఫైన్ గా గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత ఇందులోనే తొక్క తీసేసి పక్కన ఉంచిన పిస్తా, కొద్దిగా ఆయిల్ వేసి, 2 టేబుల్ స్పూన్ల కాచి చల్లార్చిన పాలు, 1 టేబుల్ స్పూన్ వెన్నిలా ఎసెన్స్ వేసి వీలైనంత మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 1 టేబుల్ స్పూన్ నెయ్యి, 50 గ్రాముల కునాఫా స్పెషల్ సేమియాని క్రష్ చేసి వెయ్యాలి. చిన్న మంట మీద గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేదాకా వేయించి పక్కనపెట్టి చల్లారనివ్వాలి. -తర్వాత ఓ బౌల్ గ్రైండ్ చేసిన పిస్తా మిశ్రమాన్ని,వేయించిన సేమియాని వేసి బాగా కలపాలి. -తర్వాత స్టవ్ మీద ఓ గిన్నెలో వాటర్ పోసి ఈ గిన్నె మీద మరో బౌల్ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల తరగిన డార్క్ చాక్లెట్ కాంపౌండ్, 2 టేబుల్ స్పూన్ల వైట్ చాక్లెట్ కాంపౌండ్ వేసి కరిగించాలి. తర్వాత దీనిని ముందుగా ఫ్రిడ్జ్ లో ఉంచిన చాక్లెట్ మౌల్స్ లో గ్యాప్స్ లేకుండా ఓ లేయర్ గా పర్చుకోవాలి. -తర్వాత ఈ చాక్లెట్ మౌల్డ్స్ ని ఫ్రిడ్జ్ లో 10 నిమిషాలు పెట్టాలి. -తర్వాత దానిని బయటకు తీసి అందులో కలిపి ఉంచిన పిస్తా,సేమియా పేస్ట్ ని వేసి,దీని చుట్టూ.. పైన కరిగించిన చాక్లెట్ మిశ్రమాన్ని వేసుకోవాలి. చాక్లెట్ మిశ్రమంతో చాక్లెట్ మౌల్డ్ ని కవర్ చేయాలి. దీనిని అరగంట సేపు ఫ్రిడ్జ్ లో పెట్టుకోవాలి. తర్వాత బయటకు తీసి చాక్టెట్ మౌల్డ్ లో నుంచి నెమ్మదిగా చాక్లెట్ ను బయటకు తీయాలి. అంతే దుబాయ్ ఫేమస్ కునాఫా చాక్లెట్ రెడీ.

తెలుగు వంటలు

## పచ్చి కొబ్బరితో కారం పొడి..ఇలా చేశారంటే అన్నం,టిఫిన్స్ లోకి అదరహో అంతే



పచ్చి కొబ్బరి కారం దక్షిణ భారతదేశంలో చాలా పాపులర్. ఈ కారం అన్నం, ఇడ్లీ, దోశ, ఇతర టిఫిన్స్ లో సైడ్ డిష్ లేదా చట్నీగా ఉపయోగించబడుతుంది. దీని తయారీ కూడా చాలా ఈజీ ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. ఇందులో ఉపయోగించే ప్రతి పదార్థం దాని సొంత ప్రత్యేకమైన పోషక విలువలను కలిగి ఉంటుంది. దీని రుచి ప్రత్యేకంగా అద్భుతంగా ఉంటుంది. మీ ఇంట్లోనే ఈజీగా పచ్చి కొబ్బరితో కారం పొడి ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

పచ్చి కొబ్బరి కారం తయారీకి కావలసిన పదార్థాలు -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1 టేబుల్ స్పూన్ -వెల్లుల్లి రెబ్బలు - 4-5 -కరివేపాకు - 1 రెబ్బ -ఎండు మిరపకాయలు - 8-10 - పచ్చి కొబ్బరి తురుము - 1 కప్పు -శనగపప్పు - 2 టేబుల్ స్పూన్లు -ధనియాలు - 1 టీ స్పూన్ -చింతపండు - చిన్న ముక్క -ఉప్పు - రుచికి తగినంత -నూనె - 2 టేబుల్ స్పూన్లు.

కొబ్బరి కారం తయారీ విధానం - ముందుగా స్టవ్ మీద ఒక బాండీ పెట్టి అందులో ఆయిల్ పోసి వేడి చెయ్యాలి. నూనె వేడెక్కిన తర్వాత శనగపప్పు, మినపప్పు వేసి అవి గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి. తర్వాత ధనియాలు,జీలకర్ర వేసి కొద్దిగా వేయించాలి. -ఇప్పుడు అందులో ఎండు మిరపకాయలు వేసి అవి కొద్దిగా కారం వాసన వచ్చే వరకు వేయించాలి. మీరు మీ రుచికి తగినట్లుగా ఎండు మిరపకాయల సంఖ్యను పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. - తర్వాత అందులో వెల్లుల్లి రెబ్బలు,కరివేపాకు వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. వెల్లుల్లి కొద్దిగా వేగాక మంచి సువాసన వస్తుంది. - చివరగా పచ్చి కొబ్బరి తురుము వేసి అది వేడి అయ్యే వరకు వేయించాలి. ఎక్కువ వేయిస్తే కొబ్బరిలోని తేమ తగ్గి కారం పొడిలా తయారవుతుంది. కాబట్టి కొద్దిగా వేడి చేస్తే సరిపోతుంది.

-స్టవ్ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీ గిన్నెలో వేయాలి. ఇందులోనే చింతపండు, రుచికి తగినంత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీరు కూడా కలుపుకోవచ్చు కానీ సాధారణంగా పచ్చి కొబ్బరిలో ఉండే తేమ సరిపోతుంది. -గ్రైండ్ చేసిన కారాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఈ కారాన్ని నిల్వ చేసుకోవడానికి ఒక గాలి చొరబడని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో ఉంచితే కొన్ని రోజుల వరకు ఫ్రెష్ గా ఉంటుంది.

## మామిడికాయ మునక్కాడ సాంబార్..



మామిడికాయ మునక్కాడ సాంబార్ తయారీకి కావలసిన పదార్థాలు -మునక్కాయలు - 2 -ఉల్లిపాయ - 1 -మామిడికాయ - 1 -నూనె -తగినంత -ఉప్పు - తగినంత -కొత్తిమీర - కొద్దిగా -కంది పప్పు - 1 కప్పు -టమాటో - 1 -పచ్చిమిర్చి - 2-3 - కరివేపాకు - 2 రెమ్మలు -ఆవాలు - 1 టీస్పూన్ -మెంతులు - 1/4 టీస్పూన్ -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఎండు మిర్చి - 2 -ఇంగువ - చిటికెడు -పసుపు - 1/2 టీస్పూన్ -సాంబార్ పొడి - 2 టేబుల్ స్పూన్లు తయారీ విధానం -ముందుగా కంది పప్పును శుభ్రంగా కడిగి తగినంత నీరు పోసి కుక్కర్‌లో లేదా గిన్నెలో మెత్తగా ఉడికించుకోవాలి. పప్పు మెత్తగా ఉడికిన తర్వాత పప్పు గుత్తితో బాగా మెదుపుకోవాలి. -ఇప్పుడు మామిడికాయను చెక్కు తీసి మీడియం ముక్కలుగా కట్ చేసుకోండి. మునక్కాయలను కూడా శుభ్రంగా కడిగి సుమారు 2 అంగుళాల పొడవు ముక్కలుగా కట్ చేసుకోండి. ఉల్లిపాయను చిన్నగా తరుగుకోండి. టమాటోను కూడా చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీలికలుగా చేసుకోండి. -తర్వాత ఒక పెద్ద గిన్నె లేదా పాన్ లో ఆయిల్ వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత మెంతులు, జీలకర్ర వేసి కొద్దిగా వేయించండి. ఎండు మిర్చి,ఇంగువ కూడా వేసి ఒక నిమిషం వేయించండి. -ఇప్పుడు తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి లేత గోధుమ రంగు వచ్చే వరకు వేయించండి. ఉల్లిపాయలు వేగిన తర్వాత తరిగిన టమాటో ముక్కలు, చీలికలుగా చేసుకున్న పచ్చిమిర్చి వేసి టమాటోలు మెత్తగా అయ్యే వరకు ఉడికించండి. టమాటోలు త్వరగా ఉడకడానికి కొద్దిగా ఉప్పు వేసుకోవచ్చు. -టమాటోలు మెత్తగా ఉడికిన తర్వాత కట్ చేసుకున్న మునక్కాయ ముక్కలు, కరివేపాకు వేసి ఒక నిమిషం పాటు వేయించండి. తర్వాత పసుపు పొడి, సాంబార్ పొడి వేసి బాగా కలపండి. మసాలాలు కూరగాయలకు బాగా పట్టేలా కొద్దిసేపు వేయించండి. -ఇప్పుడు మెదిపి పెట్టుకున్న కంది పప్పును ఈ మిశ్రమంలో వేసి బాగా కలపండి. అవసరమైనంత నీరు పోసి సాంబార్ చిక్కదనాన్ని సర్దుబాటు చేసుకోండి. మరీ పల్చగా లేదా మరీ చిక్కగా కాకుండా చూసుకోండి. -సాంబార్ కొద్దిగా ఉడుకుతున్నప్పుడు కట్ చేసుకున్న మామిడికాయ ముక్కలు వేయండి.

# సినిమా న్యూస్



## సమంత అటో.. ఇటో...!



ఖుషి' తర్వాత చాలా గ్యాప్ తీసుకుని సమంత 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. మధ్యలో వెబ్ సిరీస్‌తో, ఒకటి రెండు సినిమాలో గెస్ట్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ ఆమె అభిమానులు సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూశారు. ఎట్టకేలకు మా ఇంటి బంగారం సినిమా విడుదలకు రెడీ అయ్యింది. ఇప్పటికే విడులైన పాటలకు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ దక్కింది. సినిమాను సాధ్యం అయినంత వరకు ఎక్కువగా ప్రమోట్ చేసేందుకు సమంత ప్రయత్నాలు చేస్తుంది. సమంత చాలా గ్యాప్ తర్వాత వస్తున్న సినిమా కావడంతో బజ్ విపరీతంగా ఉంటుందని అనుకున్నారు. కానీ ఫ్యాన్స్‌లో ఉన్న ఆసక్తి, రెగ్యులర్ ప్రేక్షకుల్లో కనిపించడం లేదు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తున్న కారణంగా మా ఇంటి బంగారం సినిమాను ప్రేక్షకులు ఏ మేరకు ఆదరిస్తారు అనేది చూడాలి. మా ఇంటి బంగారం సినిమా ప్రమోషన్‌లో భాగంగా అభిమానులతో సమంత చిట్ చాట్ చేసింది. ఆ సమయంలో చాలా విషయాలపై స్పందించింది. అయితే ఆమె తదుపరి తెలుగు సినిమా ఏంటి అనే విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. అంతే కాకుండా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా సినిమాలు చేయబోతుందా అనే విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదు. దాంతో సమంత తదుపరి కెరీర్ ఏంటి అనే విషయమై అభిమానుల్లో గందరగోళం నెలకొంది. ఈ మధ్య కాలంలో సమంత కొత్తగా వైవాహిక జీవితం ను మొదలు పెట్టింది. తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైనట్లుగా చెప్పిన సమంత అనారోగ్య సమస్యలను సైతం ఎదుర్కొంది. ఇప్పుడు పూర్తి ఆరోగ్యంగా మారింది. అంతే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఆమె కొత్త జీవితం మొదలు పెట్టడంతో కెరీర్ పరంగా స్పీడ్ అందుకునే అవకాశాలు ఉన్నాయని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు. సమంత గతంలో మాదిరిగా రెగ్యులర్ కమర్షియల్ పాత్రలు చేసేందుకు ఓకే చెప్పే అవకాశాలు ఉన్నాయి. అయితే ఆమెతో కలిసి నటించే హీరో ఎవరు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. సీనియర్ హీరోయిన్స్ ను స్టార్ హీరోలు పక్కన పెడుతున్నారు. కొత్త వారితో ఎక్కువ సినిమాలు చేస్తున్నారు. కనుక సమంత హీరోలకు జోడీగా నటించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే బాలీవుడ్‌లో మాత్రం ప్రయత్నాలు చేస్తే స్టార్ హీరోలకు జోడీగా సమంత నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు. కానీ సమంత బాలీవుడ్‌కి వెళ్తుందా లేదంటే టాలీవుడ్‌లోనే ప్రయత్నాలు కొనసాగిస్తుందా అనేది చూడాలి. టాలీవుడ్‌లో స్టార్ హీరోలకు జోడీగా, కమర్షియల్ పాత్రల్లో నటించే అవకాశం రాకుంటే లేడీ ఓరియంటెడ్ సినిమాలు ఎక్కువగా చేసే అవకాశాలు ఉన్నాయి. అందుకే సమంత మా ఇంటి బంగారం సినిమా తర్వాత ఏం చేయబోతుందా అనే ఆసక్తి ఫ్యాన్స్‌లో మొదలైంది. సౌత్‌లో పెళ్లి అయిన హీరోయిన్స్‌కి గతంలో ఆఫర్లు ఉండేవి కావు. కానీ ఇప్పుడు పెళ్లి తర్వాత కూడా చాలా మంది హీరోయిన్స్ స్టార్ హీరోలకు జోడీగా నటిస్తున్నారు. నయనతార పెళ్లి చేసుకుని, ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తర్వాత కూడా స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న విషయం తెల్సిందే. కాజల్ సైతం హీరోయిన్‌గా కెరీర్‌ను పెళ్లి తర్వాత కూడా కొనసాగించడం మనం చూస్తున్నాం. అందుకే సమంత టాలీవుడ్, కోలీవుడ్‌లో కమర్షియల్ హీరోయిన్‌గా కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. స్టార్ హీరోలకు జోడీగా సమంతను మరోసారి చూడాలని కోరుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఆమె బాలీవుడ్‌కి వెళ్తుందా..? సౌత్ ఇండస్ట్రీలో సినిమాలు చేస్తుందా అనేది ఆసక్తిగా మారింది.

## కరుప్ప కూడవా.. లిరికల్ వీడియో..పూనకాలేనా?




విభిన్నమైన చిత్రాలకు, పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో సూర్య. గత కొంత కాలంగా ఎన్ని ప్రయోగాలు చేసినా సూర్యకు కలిసి రావడం లేదు. ఎంత కొత్త కథ అని ప్రయత్నించినా చేదు అనుభవమే ఎదురవుతోంది. -జై భీమ్- తరువాత మరో సక్సెస్‌ని తన ఖాతాలో వేసుకోలేకపోతున్న సూర్య ఈ సారి పక్కా రూటెడ్ స్టోరీతో చేస్తున్న మూవీ -కరుప్పు-. ఆర్.జె. బాలాజీ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై టాలెంటెడ్ బ్రదర్స్‌గా పేరు తెచ్చుకున్న ఎస్. ఆర్ ప్రభు, ఎస్.ఆర్. ప్రకాష్ బాబు ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. మే 14న తమిళంతో పాటు తెలుగులో అత్యంత భారీ స్థాయిలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దీంతో సినిమా రిలీజ్‌కు సమయం దగ్గరపడుతున్న సందర్భంగా టీమ్ ప్రమోషన్స్‌ని స్పీడప్ చేసింది. ఈ సందర్భంగా ఫస్ట్ లిరికల్ వీడియోతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసింది. తమిళ వెర్షన్‌కు సంబంధించిన -కరుప్పా కూడవా..- అంటూ సాగే లిరికల్ వీడియోని విడుదల చేసింది. సాయి అభ్యంకర్ ఈ పాటకు సంగీతాన్ని అందించడమే కాకుండా సంప్రదాయ పల్లె వాయిద్యాలతో ఈ పాటకు వీఎన్ మహాలింగంతో కలిసి స్వరాన్ని కూడా అందించాడు. స్పెషల్ వీడియో సాంగ్‌లతో యూత్‌ని ఉర్రూతలూగించిన సాయి అభ్యంకర్ ఈ పాటకు మాత్రం లోకల్ వాయిద్యాలని ప్రధానంగా తీసుకుని మ్యూజిక్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. ఓ ఎమోషనల్ సాంగ్ గా సాగే ఈ సాంగ్ ప్రముఖ ప్లాట్ ఫామ్‌లలో ట్రెండ్ అవుతూ విశేషంగా ఆకట్టుకుంటోంది. -అండము పిండము...అలర వక్కిరన్..ఆగండ కన్నోడ... అంటూ రోమాంచితంగా సాగే ఈ పాట థియేటర్లలో మాత్రం సూర్య అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన -గాడ్ మోడ్-, నాగ నాలు పేరు.. వంటి సాంగ్స్ నెట్టింట, ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాల్ని పెంచేస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన థర్డ్ లిరికల్ వీడియో మాత్రం థియేటర్లలో అభిమానులకు పూనకాలు తెప్పించేలా ఉంది. విజువల్స్ పరంగానూ, లిరికల్ పరంగానూ ఆడియన్స్‌కు అదే ఫీల్‌ని కలిగించేలా ఉంది. మే 14న రిలీజ్‌కు ముస్తాబవుతున్న ఈ మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. చాలా ఏళ్ల విరామం తరువాత సూర్యతో కలిసి త్రిష నటించిన సినిమా కావడంతో అంతా ఆసక్తిగా ఈ మూవీ రిలీజ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరికొత్త నేపథ్యంలో కురుప్పుస్వామి స్టోరీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీ సూర్య ఫ్లాపులకు బ్రేక్ వేసి భారీ బ్లాక్ బస్టర్‌ని అందిస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.

## 20 ఏళ్లకే 'పోకిరి' ని మర్చి పోయారేంటి?



తెలుగు సినిమా చరిత్ర పుటలను తిరిగేస్తే కొన్ని సినిమాలు ప్రముఖంగా కనిపిస్తాయి. అందులో 'పోకిరి' ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. మహేష్ బాబును సూపర్ స్టార్‌గా మార్చిన 'పోకిరి' సినిమాతో దర్శకుడు పూరి జగన్నాథ్ డాషింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న విషయం తెల్సిందే. అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా రికార్డులన్నింటిని కూడా తూడ్చి పెట్టిన పోకిరి సినిమా ఎంతో మందికి ఆల్ టైమ్ ఫేవరేట్ అనడం అతిశయోక్తి కాదు. మహేష్ బాబు ఇమేజ్‌ను అమాంతం పెంచేసిన పోకిరి సినిమా విడుదలై సరిగ్గా 20 ఏళ్లు పూర్తి అయింది. 2006 ఏప్రిల్ 28న ఒక మోస్తరు అంచనాలతో విడుదలైన పోకిరి సినిమా రోజులు గడుస్తున్నా కొద్ది హిట్.. సూపర్ హిట్.. బ్లాక్ బస్టర్.. ఇండస్ట్రీ హిట్‌గా మారుతూ వచ్చింది. ఇంటర్వెల్ సీన్, క్లైమాక్స్ నెవ్వర్ బిఫోర్ అన్నట్లుగా ఉండటంతో ప్రతి ఒక్కరూ సర్‌ప్రైజ్ అయ్యారు.

పోకిరి వంటి సినిమాకు సంబంధించిన ఏ చిన్న విషయం అయినా మేకర్స్ పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ 20 ఏళ్ల అరుదైన మైలు రాయిని చేరుకున్నప్పటికీ పోరికి సినిమా గురించి చిన్న సెలబ్రేషన్ కూడా లేదు. ఆ మధ్య ఒక చిన్న హీరో సినిమా వచ్చి 20 ఏళు అయిన సందర్భంగా హడావిడి చూశాం, అంతే కాకుండా ఆ సినిమాను రీ రిలీజ్ చేసి హంగామా చేశారు. కానీ పోకిరి సినిమా 20 ఏళ్ల సందర్భంగా ఫ్యాన్స్ హంగామా తప్ప మేకర్స్ నుంచి ఎలాంటి హడావిడి లేదు. దాంతో చాలా మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం మేకర్స్ ముఖ్యంగా దర్శకుడు పూరి జగన్నాథ్ అయినా పోకిరి 20 ఏళ్ల సందర్భంగా ట్వీట్ లేదా ఒక యూట్యూబ్ వీడియో లేదంటే ఒక ఆడియో బైట్ అయినా ఇచ్చి ఉంటే బాగుండేది కదా అని అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' సినిమాతో బిజీగా ఉన్నాడు. అందుకే పోకిరి సినిమా గురించి ఆయన కనీసం ట్వీట్ వేయలేక పోయాడు. ప్రస్తుతం ఆయన దృష్టి మొత్తం రాజమౌళి సినిమా పై ఉంటుంది అనడంలో సందేహం లేదు. పైగా మహేష్ బాబు ట్వీట్ వేయాలి అన్నా కూడా కచ్చితంగా రాజమౌళి పర్మీషన్ కావాల్సి ఉంటుంది. అందుకే మహేష్ బాబు పోకిరి 20 ఏళ్లకు సంబంధించిన పోస్ట్ పెట్టి ఉండడు అని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఎక్కువగా సోషల్ మీడియాలో ఉండే పూరి జగన్నాథ్ ఎందుకు పోకిరి సినిమా గురించి పోస్ట్ చేయలేదు అంటూ ప్రశ్నిస్తున్నారు. మహేష్ బాబుతో కొన్ని కారణాల వల్ల పూరికి గ్యాప్ వచ్చింది.

## జాన్వీ అందాల విందుకు శ్రుతి బోనస్ ట్రీట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న -పెద్ది- సినిమా ఇప్పుడు టాలీవుడ్ హాట్ టాపిక్. ఈ చిత్రం 25 జూన్ 2026న విడుదల కానున్నట్లు ప్రకటించడంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే పెద్ద తెరపై కేవలం చరణ్ యాక్షన్ ట్రీట్ మాత్రమే కాదు... గ్లామర్ పరంగా కూడా భారీ పోటీ ఫ్యాన్స్ కి బిగ్ ట్రీట్ గా మారనుంది. ఇందులో చరణ్ ప్రధాన హీరోయిన్‌గా నటిస్తున్న జాన్వీ కపూర్ ఇప్పటికే తన గ్లామర్‌తో కుర్రకారును ఊపేస్తుంటే.. ఇప్పుడు తనకు పోటీగా స్పెషల్ సాంగ్‌లో శ్రుతిహాసన్ ఎంట్రీ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ గ్లామర్ ఎలివేషన్ పీక్స్‌లో ఉంటుందని ఇప్పటికే విడుదలైన పాటలు పోస్టర్లు చెబుతున్నాయి. ఒకవైపు గ్రామీణ వాతావరణం.. మరోవైపు జాన్వీ అందచందాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే కేవలం జాన్వీతోనే సరిపెట్టకుండా మెగా ఫ్యాన్స్‌కు -బోనస్ ట్రీట్- ఇవ్వాలని దర్శకుడు ప్లాన్ చేశారు. దీని కోసం ఏకంగా 3.3 కోట్ల భారీ రెమ్యూనరేషన్‌తో శ్రుతిహాసన్‌ను రంగంలోకి దించారు. హైదరాబాద్ శివార్లలో శ్రుతిపై ప్రస్తుతం ప్రత్యేక గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ ప్రత్యేక గీతం షూటింగ్ మరో రెండు రోజుల్లో పూర్తి కానుంది. ఈ స్పెషల్ సాంగ్ కోసం ఏఆర్ రెహమాన్ మాంచి మాస్ మసాలా బాణీని అందించినట్లు లీకులు అందుతున్నాయి. గతంలో రవితేజ నటించిన -బలుపు- సినిమాలో శ్రుతిహాసన్ తనదైన గ్లామర్ - ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో హృదయాల్ని గెలుచుకుంది. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో రామ్ చరణ్‌తో కలిసి స్టెప్పులు వేయబోతోంది. జాన్వీ లాంటి గ్లామర్ డాళ్ సినిమాలో ఉన్నప్పుడు శ్రుతిహాసన్ తన స్పెషల్ సాంగ్‌లో అంతకుమించి అందాల విందు వడ్డించాల్సి ఉంటుంది. అందుకే ఈ ఇద్దరు భామల మధ్య గ్లామర్ యుద్ధం మెగా అభిమానులకు కన్నుల పండుగగా మారబోతోంది. ప్రస్తుతం శ్రుతిహాసన్ కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్‌లో ఉంది. ప్రభాస్ -సలార్ 2-లో శ్రుతి నటించాల్సి ఉంది. ఇంతలోనే -పెద్ది-లోని ఈ స్పెషల్ సాంగ్ కోసం ఈ బ్యూటీ ప్రాధాన్యతను ఇవ్వడం విశేషం. మిస్కిన్ దర్శకత్వంలో





రూపొందుతున్న ట్రైన్ అనే తమిళ చిత్రంలోను శ్రుతి నటిస్తోంది. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇదొక ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ అని సమాచారం. అలాగే -ఆకాశంలో ఒక తార- అనే తెలుగు చిత్రంలోను శ్రుతి నటిస్తోంది.

# కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

**- కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ**
**- హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం**
**- సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఏప్రిల్ 30 : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు. కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ. 178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది. రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు. ఫిక్సడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు. సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు. ఈ పథకాల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేత రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పని చేయించుకోవడం శ్రమ దోపిడీ అని, అందర్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. శ్రామిక మహిళల హక్కులు కాపాడాలని, మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి భద్రతా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మాలకొండపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు, ఏప్రిల్ 30 : మే 2వ తేదీ శనివారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి. ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండపై స్వామివారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో.... కందుకూరు మీూ ఇంటూరి నాగేశ్వరరావు గారు, గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. స్వామివారి దర్శన ఏర్పాట్లు, అదనపు క్యూలైన్లు, తాగునీరు మరియు భోజన సదుపాయాలు, అదనంగా లడ్డుప్రసాదాల తయారీ, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు, దాతలు మరియు సేవకుల సహకారం.. ఇంకా పలు ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ ఉత్సవాలకు 25 నుంచి 30 వేల మంది భక్తులు తరలి రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. వారందరూ సంతృప్తిగా శ్రీలక్ష్మీ సమేత నరసింహస్వామిని దర్శించు కునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దర్శనం అనంతరం, ప్రతి ఒక్కరికీ భోజన ప్రసాదం అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. అందుకోసం డైనింగ్ హాల్ తో పాటు వెనుక వైపు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసామన్నారు. అలాగే 30వేలకు పైగా లడ్డు ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకుని, దాతల సహాయంతో మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ భక్తులకు అందజేసే ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. దేవస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. భక్తులకు ఎండల నుంచి ఉపశమనం కలిగేలా, చలువ పందిళ్లు, కార్పెట్లు, కూలర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ విషయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నాగేశ్వరావు చెప్పారు. భారీ వాహనాల పార్కింగ్ కోసం, కొండ కింద ఆర్చ్ సమీపంలో విశాలమైన ప్రదేశాన్ని సిద్ధంగా ఉంచామని చెప్పారు.కొండపైకి ద్విచక్ర వాహనాలు, పరిమిత సంఖ్యలో కార్లను మాత్రమే అనుమతిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. స్వామివారి జయంతి సందర్భంగా కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని అన్నిస్టేషన్ల నుంచి సుమారు 100 మందికి పైగా పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. జయంతిని పురస్కరించుకుని, మాలకొండ దేవస్థానం పరిధిలో పనిచేసే 123 మంది ఉద్యోగులకు యూనిఫామ్ ను ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నేతలు పెగడ శ్రీనివాసులు, బొల్లినేని నాగేశ్వరరావు, కామినేని అశోక్, మోహన్, శనివారపు మాల్యాద్రి తదితరులు ఎమ్మెల్యే గారి వెంట ఉన్నారు.

# నేనసలే మంచి వాడిని కాను

**- ఇరాను అణు ఒప్పిందానికి రావాల్సిందే**
**- అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు**
**- మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, ఏప్రిల్ 30 : దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు . కాగా, శాంతి ఒప్పందానికి అంగీకరించేలా ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది (జా ఎసజీని బి।నిబతినీనిబ). అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి శాంతి చర్చలు జరగడం లేదు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా బెదిరించారు. నిలిచిపోయిన అణు కార్యక్రమం చర్చలపై ఇరాన్ త్వరగా తేల్చాలని, తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తుపాకితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. దీంతో ఇది నెట్టింట వైరల్ అయింది. యుద్ధం ముగిసిన తరువాతే అణు కార్యక్రమంపై చర్చలని ఇరాన్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన పోస్టులో, 'ఇరాన్ తమ పనిని సరిగ్గా చేయ లేకపోతోంది. వారికి అణురహిత ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో తెలియదు. వారు త్వరగా తెలివిగా వ్యవహరించాలి!' అని రాసుకొచ్చారు. ఈ పోస్టుతో పాటు, ట్రంప్ తన ఎఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు, అందులో ఆయన అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకొని ఉండగా, వెనుక పర్వత ప్రాంతంలో బాంబులు పేలుతున్నాయి. ఆ చిత్రంపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై- (ఇకపై మంచివాడిగా ఉండను!) అని బ్యానర్ ఉంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధించాలని ట్రంప్ ఆదేశించారని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం నివేదించింది. ఈ కథనం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ ఓడరేవులను సుదీర్ఘకాలం పాటు దిగ్బంధించడానికి సిద్ధం కావాలని ట్రంప్ జాతీయ భద్రతా అధికారులను ఆదేశించారు. ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరపడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని 20 ఏళ్ల పాటు నిలిపివేసేలా, ఆ తర్వాత కఠినమైన ఆంక్షలను అంగీకరించేలా బలవంతం చేయాలని ఆయన ఆశిస్తున్నారని ఆ కథనం తెలిపింది. అమెరికా తమ దేశ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివర్ణించింది. ఈ వివాదంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు, భద్రతా మండలికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని అధికారికం గా ఫిర్యాదు చేశారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టవిరుద్ధమైనవని ఆయన పేర్కొన్నారు.

## బల్కుగా ఆయిల్ వినియోగించే వారందరూ ముందుగానే ఇండెంట్ ఇచ్చి బుక్ చేసుకోవాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఒంగోలు, ఏప్రిల్ 30 : బల్కుగా ఆయిల్ వినియోగించే వారందరూ ముందుగానే ఇండెంట్ ఇచ్చి బుక్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు, వివిధ శాఖల పర్యవేక్షణలోని యూనిట్లకు అవసరము - సరఫరాపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిందని, రెగ్యులర్ వినియోగానికి ఎలాంటి ఇబ్బందీ లేదని డిఎస్ఓ పద్మశ్రీ ఈ సందర్భంగా తెలిపారు. అన్ని వాహనాలకు బంకులలో ఆయిల్ అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయం, ఆక్వా కల్చర్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ఆయా శాఖల పర్యవేక్షణలో ప్రత్యేక టోకెన్లు మంజూరు చేశామన్నారు. చీమకుర్తిలోని గ్రానైట్ పరిశ్రమలు కూడా తమ అవసరాలకు ముందుగానే ఇండెంట్ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. అయితే బల్లికురవ ప్రాంతంలోని గ్రానైట్ యజమానులు మాత్రం బల్క్ వినియోగానికి ముందస్తుగా ఇండెంట్ ఇవ్వలేదని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి ఆమె తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ బల్క్ వినియోగానికి ప్రత్యేకముగా ముందస్తు ఇండెంట్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులతో ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించాలని కలెక్టర్ చెప్పారు. మార్కెటింగ్, పరిశ్రమల శాఖలు కూడా తమ పరివేక్షణలోని యూనిట్లకు ఆయిల్ అవసరతను గుర్తించి, ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ వరలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ

**- కార్పోరేట్ సంతుష్టీకరణలో పాలకులు**
**- అనేక ఆందోళనతో అడ్డుకుంటూనే ఉన్నాం**
**- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

విజయవాడ, ఏప్రిల్ 30 : ప్రభుత్వాలు కార్మికుల హక్కులపైనే కాక జీవితాలపైన, ప్రజాస్వామ్య హక్కులపైన, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. ఈ హక్కులను కాపాడుకోవడానికి యావత్ కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులు అమలు కావాలని అన్నారు. నిరంతరం కార్మిక దోపిడీ జరుగుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ఏటేటా మేడేలు జరుపుకోవడం తప్ప కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన చెందారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకై మానవ హారాలు, పాదయాత్రలు, మహాప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాలుగా రాజీ లేని పోరాటాలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా నేటి వరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు సాగలేకపోయిందన్నారు. అయితే దానిని అభివృద్ధి చేసి, దానికి గనులు కేటాయించి, మరింత పటిష్టంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం లేదన్నారు. తిరుపతి టిటిడి ఫారెస్టు కార్మికులు 38 నెలల పాటు ఆందోళనలు కొనసాగించారు. అనేక ఒత్తిళ్లు చేసినా కార్మికులు పోరాటాన్ని ఆపలేదన్నారు. విజయనగరం మిమ్స్ మెడికల్ కాలేజీ కార్మికులు 80 రోజుల పాటు పోరాటాలు చేశారు.

32 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఇద్దరు సిఐటియు నాయకులతో సహా 19 మంది కార్మికులను విశాఖ సెంట్రల్ జైలుకు 14 రోజులు రిమాండ్‌కు పంపారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదిరించి కార్మికులు పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు మున్సిపాల్టీలో వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెంటర్లు పిలవడానికి వ్యతిరేకంగా కార్మికులు 14 రోజుల పాటు సమరశీలంగా సమ్మె నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. దీంతో ప్రభుత్వం టెండర్లను ఉపసంహరించుకోవడమే కాక, కార్మికులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయక తప్పలేదు. విశాఖ డెయిరీ కార్మికుల పోరాటం, సినర్జీస్ కార్మికుల సమ్మె, బ్రాండిక్స్ కార్మికుల మూడు రోజుల సమ్మె, రాజమండ్రి ఆంధ్రా పేపర్‌మిల్లు కార్మికులు 2,500 మంది 34 రోజుల సమ్మె, ఎన్‌టిఆర్ జిల్లా ముఠా కార్మికుల సమ్మెలు ఈ కాలంలో జరిగాయి. కార్మికులు పోరాటాలతో కొన్ని విజయాలు సాధించుకోగలిగారు. నెల్లూరులో జెన్కోను అదానీకి కట్టబెట్టే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 396 రోజుల ఆందోళనను కార్మికులందరూ కలసి నిర్వహించారు. కార్మికులు, ఇంజినీర్లు కలసి సిఐటియు చొరవతో జెఎసి గా ఏర్పడి పోరాడారు. ప్రజల మద్దతు పొందారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు ఎస్మాను సైతం ధిక్కరించి, నిర్బంధాన్ని ఎదురించి సమరశీలంగా సమ్మె నిర్వహించారు. గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్, రిటైర్మెంట్ వయసు పెంపు, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి పెంపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, సమ్మె కాలపు వేతనాలు తదితర జీఓలను సాధించుకున్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 16 రోజుల సమ్మెను సమరశీలంగా నిర్వహించారు. వేతన పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించుకున్నారు.

సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజులు సమ్మె నిర్వహించారు. దాదాపు 8 వేల మంది ఉద్యోగులు 23 శాతం వేతన పెంపు, సమ్మె కాలపు వేతనాలు సాధించుకున్నారు. ఆశా కార్మికులు సమరశీలంగా అనేక పోరాటాలు నిర్వహించి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్లు, ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయసు పెంపులను సాధించుకున్నారు. మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ తదితర రంగాల్లోనూ పోరాటాలను నిర్వహించారు. రాజీ లేకుండా సమరశీలంగా ఫలితం వచ్చేదాకా పోరాడ్డం ద్వారా కార్మికవర్గం విజయాలు సాధించగలదని, ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టగలదని తేటతెల్లమైందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ పోరాటాల వలన ఆయా కార్మికుల్లో పోరాట స్ఫూర్తిని పెంచాయి. రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను భవిష్యత్తులో ఐక్య పోరాటాల ద్వారానే తిప్పి కొట్టగలం అన్నారు.

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

మొదటిపేజీ తరువాయి

భవిష్యత్తుకు అనుగుణంగా పోలీస్ శాఖను సిద్ధం చేశామని చెప్పారు. 'నా స్వరాష్ట్రానికి నన్ను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. సీఎం ఎన్నో కీలక బాధ్యతలు అప్పగించారు. నేను ఈ స్థాయికి రాడానికి కారణమైన నా గురువులకు ధన్యవాదాలు. యంగ్ పోలీస్ వల్ల పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. పోలీస్ పవర్ అంటే గౌరవంగా జీవించడం. సమష్టి కృషి వల్లే ఈ స్థాయిలో ఉన్నాను. నా కుటుంబసభ్యులకు ధన్యవాదాలు. మంచి ఛాలెంజింగ్ అధికారి రాబోతున్నారు.. రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌కు అభినందనలు' అని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

మొదటిపేజీ తరువాయి

తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

మొదటిపేజీ తరువాయి

సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టలులు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

మొదటిపేజీ తరువాయి

అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి

## - విద్యా కార్యక్రమాల అమలుపై కీలక ఆదేశాలు
## - రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించడంతో పాటు విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదేశించారు. గురువారం హైదరాబాదు నుంచి విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న విద్యా వారోత్సవాలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ, 2026--2027 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 2700 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు లేని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటర్, పదో తరగతిలో ఫెయిల్ అయిన ప్రభుత్వ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలలో అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులతో శంకుస్థాపనలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వామ్యం చేస్తూ విద్యా శిబిరాలు, వర్క్‌షాప్‌లు, బడిబాట వంటి కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, వాటి ప్రచారాన్ని విస్తృతంగా చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్, తాగునీటి కొరత ఉన్న పాఠశాలల్లో యుడిఐఎస్‌ఈ పోర్టల్ ప్రకారం పనులను తక్షణమే పూర్తి చేసి, నివేదికలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. కేజీబీవీలలో సప్లిమెంటరీ విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా రెమెడియల్ కోచింగ్ నిర్వహించడంతో పాటు వేసవి క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్ మాట్లాడుతూ, మే 11 నుంచి 16 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు, వార్డు సభ్యులు, పాఠశాల విద్యా కమిటీలతో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. బడిబాట మరియు పీటీఎం నమోదు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నమోదు పెంచేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని, ర్యాలీల ద్వారా అవగాహన కల్పించాలని చెప్పారు. డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. బాలబాలికల భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలు, చేతివృత్తులపై శిక్షణల ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి బి. నాగలక్ష్మి, విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, ఎసిజిఈ మాధవరావు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హత కలిగిన జర్నలిస్టులకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు జారీ

## - జిల్లా కలెక్టర్ అంకిత్
## - నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : అర్హత కలిగిన జర్నలిస్టులకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జారీ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని, ముఖ్యంగా జి.ఓ.నెం. 252లో పేర్కొన్న నియమ నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. అక్రిడిటేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, నిజాయితీతో పరిశీలన చేపట్టి అర్హులైన వారికి మాత్రమే కార్డులు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధుల సేవలను గౌరవిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మాజీ జెడ్పీటీసి గిడ్ల పరంజ్యోతి రావుకు ఘన నివాళులు

## మాల మహానాడు నేతల అశ్రునివాళి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రముఖ దళిత నాయకుడు, కొత్తగూడెం మాజీ జెడ్పీటిసి, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడ్ల పరంజ్యోతి రావు మరణం పట్ల జిల్లా వ్యాప్తంగా విషాదం నెలకొంది. దళితుల ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం పోరాడిన ఆయన, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నేత పీవీ రావు నాయకత్వంలో పనిచేసిన తొలి తరం నాయకుల్లో ఒకరుగా గుర్తింపు పొందారు. గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. గురువారం కొత్తగూడెంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించగా, అంతిమయాత్రలో మాల మహానాడు రాష్ట్ర, జాతీయ, జిల్లా స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని గిడ్ల పరంజ్యోతి రావుకు ఘన నివాళులు అర్పించారు. ఆయన పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు తల్లమల్ల హసేన్, జాతీయ ఉపాధ్యక్షులు మన్నే బాబురావు, జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతోటి కాంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంతెటి వీరభద్రం, జాతీయ అంబేద్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగాల రవికుమార్, హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్, న్యాయవాది ఏడిండ్ల అశోక్, మాల మహానాడు ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కూరపాటి రవీందర్, డాక్టర్ ఎం. కాంతయ్య, దాసరి శేఖర్, దాసరి శ్రీనివాస్, గుమ్మడి కనకరాజు, రామ్ చందర్, మాల మహానాడు మహిళా ప్రధాన కార్యదర్శి మేదిని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నవ భారత్ యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తోంది

## సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీ పోరాటాలు - సీఐటీయూ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, ఏప్రిల్ 30 : పాల్వంచలోని నవ భారత్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తోందని, ఈ పరిస్థితిని సహించబోమని సీఐటీయూ జిల్లా నాయకులు హెచ్చరించారు. నవ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సిహెచ్‌పీ) గేట్ వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజె రమేష్, అధ్యక్షులు కే. బ్రహ్మాచారి, సీనియర్ నాయకులు యం.వి. అప్పారావు మాట్లాడుతూ, కంపెనీలో కేవలం 42 మంది మాత్రమే స్థిర ఉద్యోగులు ఉండగా, దాదాపు 2,000 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల శ్రమతోనే సంస్థ లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. కార్మికులకు క్యాటగిరైజేషన్ అమలు చేయకపోవడం, అందరినీ అన్‌స్కిల్డ్ కార్మికులుగా చూపించడం, పే స్లిప్‌లు ఇవ్వకపోవడం, గ్రాట్యుటీ, వీక్లీ ఆఫ్‌లు అమలు చేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. కార్మికుల హక్కుల కోసం యూనియన్ ఏర్పాటు చేయగానే నాయకత్వాన్ని భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేస్తూ, యాజమాన్యం వెంటనే యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్మిక శాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పొదిల తులసీరామ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే. సత్య, సీనియర్ నాయకులు బాస నారాయణ, నవ భారత్ కార్మిక సంఘం నాయకులు ఎస్. గోపాలకృష్ణ, కే.సుధీర్ కుమార్, జె. దేవిలాల్, ఏ. యాకుబ్, బి.సురేష్, బి.వినోద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చీమలపాడు, ఆర కొత్తగూడెం ఇసుక ర్యాంపు సమస్యల్ని పరిష్కరించాలి

## - పాత కమిటీకి హైకోర్టు ఇచ్చిన హార్డర్ ని రద్దు చేయాలి - నూతన కమిటీలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్
## -కలెక్టర్ ఆఫీస్ ఎదుట కొత్త సొసైటీ సభ్యుల ధర్నా




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కొత్తగూడెం/పాల్వంచ, ఏప్రిల్ 30 : చీమలపాడు, ఆర్.కొత్తగూడెం ఇసుక ర్యాంపుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో గురువారం భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ, ఇసుక సొసైటీ కమిటీల గడువు ముగిసిన తర్వాత మహాజనసభల ద్వారా నూతన కమిటీలను ఎన్నిక చేసినప్పటికీ అధికారులు అనుమతులు ఇవ్వడంలో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా సొసైటీ సభ్యుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. పాత కమిటీకి అనుకూలంగా కోర్టు ఆర్డర్ తీసుకురావడం ఇసుక నిబంధనలు, పీసా చట్టానికి విరుద్ధమని ఆరోపించారు. ఈ సమస్యను అధికారులు సకాలంలో పరిష్కరించి ఉంటే ఇంత వివాదం నెలకొనేదే కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుని, నూతన కమిటీలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపుల విషయంలో కొనసాగుతున్న వివాదాలు హింసాత్మక ఘటనలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, తక్షణ చర్యలు తీసుకోకపోతే జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జాటోత్ కృష్ణ, కల్లూరు కిషోర్, వెంకటేశ్వర్లు, సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, చర్ల మండలం పార్టీ మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య, శ్రీ సిరాజు సొసైటీ అధ్యక్షురాలు ఇర్పా సామ్రాజ్యం, ఆర కొత్తగూడెం సొసైటీ అధ్యక్షురాలు అశ్విని, సుజాత, నాగమణి, నాగలక్ష్మి ,స్వప్న, పార్వతి, శాంతకుమారి,సరిత ,సత్యవతి, చిట్టెమ్మ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో డయాగ్నొస్టిక్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

## - లోపాలపై నోటీసులు జారీ - వైద్యాధికారుల హెచ్చరికలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, ఏప్రిల్ 30 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలోని డయాగ్నొస్టిక్ సెంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలపై గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆదేశాల మేరకు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాందాస్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా కేంద్రాల రికార్డులను పరిశీలించిన అధికారులు, గుర్తించిన లోపాలపై నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిబంధనలు పాటించని కేంద్రాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

# చిన్నారిని మింగిన మిషన్ భగీరథ గుంత

## - పూడ్చకుండా ఉంచడంతో గుంతలో పడ్డ ఐదేళ్ల మోక్షిత - అధికారుల తీరుపై గ్రామస్థుల ఆందోళన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఏప్రిల్ 30 : జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక పసి ప్రాణాన్ని బలితీసుకుంది. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో, ప్రమాదవశాత్తు అందులో పడి మోక్షిత అనే ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

స్థానికుల కథనం ప్రకారం.. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో, సుమారు 20 రోజుల క్రితం అధికారులు మరమ్మత్తుల కోసం 4 మీటర్ల లోతున భారీ గుంతను తవ్వారు. అయితే, మరమ్మత్తులు పూర్తయినా లేదా మధ్యలో నిలిచిపోయినా, ఆ గుంతను పూడ్చకుండా అధికారులు అలాగే వదిలేశారు. గత మూడు వారాలుగా ఆ మృత్యు గుంత పాఠశాల ముందే దర్శనమిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా దాని భద్రత గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో కవిత అనే మహిళ ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన ఇద్దరు కుమార్తెలు దక్షిత , మోక్షితలను వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చింది. తల్లి లోపలికి వెళ్లిన క్రమంలో, ఆడుకుంటూ వెళ్లిన మోక్షిత ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయింది. పక్కనే ఉన్న అక్క దక్షిత ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో, కవిత పరుగులు తీస్తూ వచ్చి తన చిన్నారిని కాపాడుకునేందుకు గుంతలోకి దూకింది. కవితతో పాటు దక్షిత కూడా గుంతలోకి దూకింది. గుంతలో మునిగిపోతున్న వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. తల్లి కవిత, అక్క దక్షిత ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఐదేళ్ల మోక్షిత అప్పటికే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ తన కళ్లముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మిషన్ భగీరథ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే మోక్షిత ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు దిగారు. స్కూల్ ఎదుటే అంత లోతైన గుంతను 20 రోజుల పాటు పూడ్చకుండా వదిలేయడం అధికారుల నేరపూరిత నిర్లక్ష్యమేనని వారు మండిపడుతున్నారు. తక్షణమే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో ఆలీంపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

# మణుగూరులో వడగళ్ల వర్షం

## కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం-ధాన్యం కేంద్రాలలో అధికారులు పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, ఏప్రిల్ 30 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. ఎదురుగాలులతో కూడిన ఈ అకాల వర్షం కారణంగా జనజీవనం కొంతసేపు అస్తవ్యస్తమైంది. మణుగూరు పట్టణంలోని సుందరయ్య నగర్, పీవీ కాలనీ, కార్మికవాడలు, గనుల ప్రాంతాలు, తొగ్గుడెం తదితర ప్రాంతాల్లో వడగండ్ల వర్షం నమోదైంది. వడగళ్ల వర్షంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా, అకాల వర్షం నేపథ్యంలో రైతులు ఆరబోసిన ధాన్యం నష్టపోయిందా అనే అంశంపై తహసీల్దార్ అద్దంకి నరేష్, ఆర్ఐ గోపి, డీటీ రామారావు కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పరిశీలన అనంతరం ధాన్యం ఆరబోసిన ప్రాంతాల్లో వర్షం ప్రభావం లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదని తహసీల్దార్ అద్దంకి నరేష్ తెలిపారు.

# చిన్నపాటి మందలింపుకే ఆత్మహత్య

## మృత్యువుతో పోరాడుతూ బాలిక మృతి - టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన వర్షిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 30 : ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన అత్యంత విషాదకరం. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన ఒక విద్యార్థిని ప్రాణాలు తీసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామానికి చెందిన దారెల్లి వర్షిత (16) అనే విద్యార్థిని విషాదకరంగా ప్రాణాలు కోల్పోయింది. ఏప్రిల్ 24వ తేదీన ఉదయం ఆలస్యంగా నిద్రలేచినందుకు తల్లి మందలించగా, ఆవేశానికి లోనైన వర్షిత ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వర్షిత పరిస్థితి విషమించడంతో ముందుగా ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు ఆమెను బతికించడం కోసం ప్రయత్నాలు చేసిన పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వర్షిత బుధవారం విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 530 మార్కులు సాధించి చదువులో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ విషయం తెలిసిన తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా

# సత్తుపల్లి నుండి విజయవాడ బస్సు చార్జీలు తగ్గింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 30 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుండి విజయవాడ ఎక్స్ప్రెస్ బస్సు చార్జీలను తగ్గించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రాలో తిరిగే ఎక్స్ప్రెస్ బస్సులకు ఆంధ్ర సెక్టార్ విసన్నపేట నుండి విజయవాడ 15 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సత్తుపల్లి నుండి విజయవాడ వెళ్లే ఎక్స్ప్రెస్ బస్సులలో విస్సన్నపేట నుండి విజయవాడ కేవలం 80 రూపాయలతో ప్రయాణించవచ్చునని ఆయన అన్నారు. 15% రాయితీ ప్రకటించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. గతంలో విసన్నపేట నుండి విజయవాడ 90 రూపాయలు చార్జీ ఉండేది అని ఇప్పుడు 80 రూపాయలుగా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కావున సత్తుపల్లి డిపో పరిధిలోని విజయవాడ వెళ్లే ప్రయాణికులు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com